సబ్‌కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు



చౌక దుకాణాల పరీక్ష హాల్‌టికెట్లలో గోల్‌మాల్!

● దరఖాస్తులు దాచేశారని సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు

● సబ్‌కలెక్టరేట్ వద్ద బాధితుల ఆందోళన

మదనపల్లె టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌకదుకాణాల డీలర్ల నియామకం పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారి అప్లికేషన్లు దాచేశారని, అర్హులైన వారు పరీక్షకు హాజరయ్యేందుకు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదని పలువురు దరఖాస్తుదారులు సబ్‌కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. సోమవారం సాయంత్రం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్దకు చేరుకున్న దరఖాస్తుదారులు మాట్లాడుతూ మదనపల్లె మండలం రామసముద్రం, నిమ్మనపల్లె మండలాలతో పాటు తంబళ్లపల్లెలో ఆరు మండలాలు, కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో ఖాళీగా ఉన్న చౌకదుకాణాల డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. నోటిఫికేషన్ ప్రకారం అన్ని అర్హతలున్న తాము అన్ని సర్టిఫికెట్లు సేకరించి దరఖాస్తు చేసుకుంటే తాము అనర్హులంటూ తమ దరఖాస్తులు దాచిపెట్టేశారని, కొన్ని దుకాణాలకు రిజర్వేషన్లు మార్చివేసి తమకు అన్యాయం చేశారన్నారు. సీఎస్ డీటీలు, సబ్‌కలెక్టరేట్ సిబ్బంది కలసి తమకు హాల్‌టికెట్లు మంజూరు కాకుండా గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. బసినికొండ వీఆర్వో గ్రామాల్లోకి వచ్చి విచారించకుండా కార్యాలయం నుంచే ఫోన్‌లో వివరాలు అడిగి తప్పుడు నివేదికలు ఇచ్చి తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ విషయమై సబ్‌కలెక్టర్ విచారించి మంగళవారం నిర్వహించనున్న రాత పరీక్షకు తమను అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి, తలారి రాధ, నాగమణి, విజయ, పూలకుంట్ల హరినాథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ బాధ్యత.. బరువు కాదు

● పీలేరులో పోలీసుల ర్యాలీ

పీలేరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను బాధ్యతగా ధరించాలని, భారంగా భావించకూడదని పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఆదేశాల మేరకు పీలేరు అర్బన్ పోలీసులు సోమవారం పీలేరులో హెల్మెట్‌ల వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చాలామంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడాన్ని భారంగా భావిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్‌లు లేకపోవడం వల్ల అధికంగా ప్రాణనష్టం జరుగుతున్నట్లు చాలా అధ్యయనాల్లో వెల్లడైందన్నారు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ధరించిన వాహనదారులు ప్రాణగండం నుంచి తప్పించుకోవచ్చునన్నారు. ఈ విషయాలను వాహనదారులకు తెలియజేసి రోడ్డు ప్రమాదాల్లో మరణాల రేటును తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్టు ధరించాలన్నారు. స్థానిక అర్బన్ సీఐ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ట్రాఫిక్ నియమాలు పాటిస్తామంటూ ద్విచక్ర వాహనదారులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐలు బాలకృష్ణ, లోకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



పీలేరులో హెల్మెట్ల వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

న్యాయం జరిగేనా..?

● వైసీపీ నేతల పాపం వారికి శాపం...

● ప్రాజెక్టుకు భూములిచ్చి రోడ్డున పడ్డ రైతులు

● నీటమునగనున్న నాలుగు గ్రామాలు

● దిక్కుతోచని స్థితిలో ముదివేడు రిజర్వాయర్ బాధితులు




పిచ్చలవాండ్లపల్లె సమీపంలో నిర్మిస్తున్న ముదివేడు రిజర్వాయర్ (ఫైల్)

కురబలకోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు చేసిన పాపాలు రైతన్నల పాలిట శాపంగా మారాయి. తమ స్వార్థంతో పాటు కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చడానికి ముదివేడు రిజర్వాయర్‌ను అప్పట్లో ఆఘమేఘాలపై మంజూరు చేశారు. ఏడాదికి మూడు పంటలు పండే భూములను ప్రాజెక్టు నిర్మాణానికి ఇవ్వడానికి రైతులు నిరాకరించడంతో వైసీపీ నేతలు పోలీసులపై ఒత్తిడి తెచ్చి వారి ద్వారా రైతులను రకరకాలుగా బెదిరింపు చర్యలకు పాల్పడి భూములను బలవంతంగా తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో వ్యవసాయం తప్ప మరేమీ తెలియని రైతులు తమకున్న ఏకైక ఆధారం సారవంతమైన భూములను కోల్పోయి ప్రస్తుతం రోడ్డున పడ్డారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట, బి.కొత్తకోట మండలాల పరిధిలో రూ.759.50 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. కాంట్రాక్టర్లకు, వైసీపీ నేతలకు లబ్ధి చేకూర్చడానికి చేపట్టిన ప్రాజెక్టును ఎటువంటి అనుమతులు లేకుండానే రాత్రి,పగలు అనే తేడా లేకుండా నిర్మాణ పనులను చకచకా చేపట్టి మూడు వంతులకు పైగా పనులు పూర్తి చేశారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులను గతంలో నిర్ణయించిన పరిహారం ఇప్పటి వరకు వారికి పంపిణీ చేయలేదు. వైసీపీ ప్రభుత్వం తమను నిలువునా ముంచేసిందని, కూటమి ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


గత వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్ల రూపాయలకు పైగా అంచనా వ్యయంతో మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేసింది. కేవలం ఒక్క ప్రాజెక్టు అనుమతితో అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు అప్పట్లో చర్యలు చేపట్టింది. కాగా చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని ఆవులపల్లె, నేతిగుంటపల్లె, అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలో ప్రాజెక్టులకు ప్రభుత్వం 2021లో అనుమతులు మంజూరు చేసింది. కాగా వీటిలో ముదివేడు రిజర్వాయర్ నిర్మాణాన్ని 1.98 టీఎంసీల సామర్థ్యంతో రూ.759.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణాన్ని చేపట్టింది. ఈ రిజర్వాయర్‌ను కురబలకోట, బి.కొత్తకోట మండలాల పరిధిలో 1077 ఎకరాలలో నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం వ్యవసాయ భూములు, గ్రామాలు, చెరువులు, కుంటలను తీసేసుకున్నారు. కాగా కురబలకోట మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలో 798.7 ఎకరాలు, కురబలకోట పంచాయతీలో 66.70 ఎకరాలు, ముదివేడు పంచాయతీలో 64.95 ఎకరాలు బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీలో 146.05 ఎకరాలు ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎంపిక చేశారు. కాగా పట్టా, డీకేటీ భూములకు ఒకే రకంగా భూపరిహారాన్ని ఎకరాకు రూ.12.50 లక్షలుగా నిర్ణయించారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి కొంతమంది రైతులు అంగీకరించకపోవడంతో వారిని పలుమార్లు పోలీసులు రకరకాలుగా బెదిరించడంతో కొంతమంది అంగీకారపత్రాలపై సంతకాలు చేయగా మరికొంతమంది నిరాకరించారు. అయితే రైతులకు ఇవ్వాల్సిన భూపరిహారం విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులు రైతులతో సమావేశాలు జరిపారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్మాణానికి పర్యావరణ అనుమతులు లేవని గ్రీన్ ట్రైబ్యునల్ రూ.100 కోట్ల జరిమానా విధించడంతో పనులు నిలిచిపోయాయి. అంతేకాకుండా ప్రాజెక్టును అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అడ్డుకున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తూ తంబళ్లపల్లె నియోజకవర్గ పర్యటనకు వచ్చిన చంద్రబాబుపై అంగళ్లలో వైసీపీ నేతలు దాడికి పాల్పడి తిరిగి వారే చంద్రబాబుతో పాటు వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేశారు. ఇలాంటి తరుణంలో ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాగా ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన భూనిర్వాసితులకు రావాల్సిన భూపరిహారం, పునరావాసం ఇప్పట్లో అందే పరిస్థితి కనిపించడం లేదు. రైతుల భూములలో నిర్మాణ పనులను చేపట్టడంతో ఆ భూములు వ్యవసాయం చేసుకోవడానికి ఏమాత్రం పనికిరాకుండా పోయాయి. కట్ట నిర్మాణానికి అవసరమైన మట్టిని దాదాపుగా 400 ఎకరాలకు పైగా రైతుల పొలాల్లోని యంత్రాల సహాయంతో తీసి కట్ట నిర్మాణ పనుల కోసం తరలించారు. దీంతో ఆ పొలాలు వ్యవసాయానికి ఏమాత్రం పనికి రాకుండా పోయాయి. కాగా ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున గుత్త చెల్లిస్తామని నమ్మబలికి, కేవలం ఏడాది మాత్రం ఇచ్చి ఆ తర్వాత గుత్త సొమ్ము కూడా ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు.

పునరావాస కల్పనలో న్యాయం జరగలేదు.

ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసాలు కల్పించడంలోనూ న్యాయం జరగలేదు. వైసీపీ పాలనలో అధికార దుర్వినియోగానికి పాల్పడి ఇష్టానుసారంగా ప్రాజెక్టును మంజూరు చేసి రైతుల వద్ద నుంచి బలవంతంగా భూములను లాక్కుని రిజర్వాయర్ నిర్మాణ పనులను ఆఘమేఘాలపై ప్రారంభించారు. కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలోని శీతివారిపల్లె, కొత్తపల్లె, బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీలోని చౌటకుంటపల్లె, దిన్నిమీదపల్లె గ్రామాలు రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే పూర్తిగా నీటమునగనున్నాయి. వీరికి పునరావాసం కోసం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలో 204 కుటుంబాలు, కోటావూరు పంచాయతీలో 125 కుటుంబాలను ఎంపిక చేశారు. కాగా ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములను కోల్పోయిన భూనిర్వాసితులకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని మంజూరు చేసింది. ఇందులో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితుల కోసం ప్రత్యేకంగా స్థలాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలను చేపడతామని చెప్పారు. కాగా కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలోని భూనిర్వాసితుల కోసం ముదివేడు క్రాస్ సమీపంలోని తానామిట్ట వద్ద 21.50 ఎకరాలు, బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీలో నిర్వాసితుల కోసం 13.50 ఎకరాలను ఎంపిక చేసింది. కాగా ఒక్కొక్క కుటుంబానికి 5 సెంట్ల స్థలంతో పాటు అన్ని రకాల మౌలిక సౌకర్యాలను కల్పిస్తుంది. ఇదిలా ఉండగా ఇంటి నిర్మాణాన్ని సొంతంగా నిర్మించుకునే వారికి రూ.10 లక్షలు, అలా కాకుండా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ప్రభుత్వ నిబంధనలు మేరకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టి వారికి అప్పగించడంతో పాటు మిగిలిన నగదును వారికి అందచేస్తామని చెప్పారు. అయితే ప్యాకేజీకి సంబంధించి పలుమార్లు అధికారులు భూనిర్వాసితులతో సమావేశాలు నిర్వహించినా వారికి స్థలాలు కేటాయించడం కానీ, ప్యాకేజీకి సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



మట్టి తరలించడంతో గుంతలమయమైన పొలాలు



మా పరిధిలో ఏమీ లేదు..

ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన అన్ని నివేదికలను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేశాము. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు పరిహారం, పునరావాసాలకు సంబంధించి రైతుల నుంచి పూర్తి వివరాలను అప్పట్లో పనిచేస్తున్న అధికారులు సంబంధిత శాఖాధికారులకు అందజేశారు. మా పరిధిలో ఏమీ లేదు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

- తపశ్విని, తహసీల్దార్

వంద శాతం పింఛన్ల పంపిణీ జరగాలి

● ఉద్యోగులపై దాడులు చేస్తే చట్టప్రకారం చర్యలు ● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 31వ తేదీ జిల్లాలో వందశాతం సామాజిక పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాల్లో వర్చువల్‌గా సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 31వ తేదీ మంగళవారం వందశాతం పింఛన్ల పంపిణీ సక్రమంగా జరగాలని, లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని తెలిపారు. 31న ఉదయం 5.30కు పింఛన్ పంపిణీ చేసే సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు.

ఉద్యోగులపై దాడులు చేస్తే కఠిన చర్యలు

విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, దాడులు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వీలైతే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పనిచేసే వారిపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే సంబంధిత సబ్‌కలెక్టర్లు, హెచ్‌వోడీ ద్వారా కలెక్టరు దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జగన్ జమానా అంతమైంది

● అరాచకాలకు పాల్పడితే సహించేది లేదు

● ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమానా అంతమైందని, మదమెక్కిన మదపుటేనుగులు అరాచకాలు చేస్తే చూస్తూ సహించేది లేదని ఏపీ పంచాయతీరాజ్ రాజ్ చాంబర్ అధ్యక్షుడు, సర్పంచుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. చంద్రబాబు తలుచుకుంటే ఒక్క ఆర్డినెన్స్‌తో మీ పదవులు గల్లంతవుతాయన్నారు. ఎంపీడీఓపై దాడికి పాల్పడిన వైసీపీ నేతలపై పీడీ యాక్ట్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును సోమవారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీడీవోపై దారుణంగా వైసీపీ ఎంపీపీ కుమారుడితో పాటు ఇతర అసాంఘిక శక్తులు దాడికి పాల్పడ్డాయన్నారు. ఇటువంటి సంఘటనలు తేలికగా తీసుకుంటే ఇవి మళ్లీ పునరావృతం అయ్యే పరిస్థితి ఉందని చెప్పారు. ఉద్యోగులు పనిచేయలేని పరిస్థితి ఉంటుందన్నారు. కడప కార్పొరేషన్‌లో కడప ఎమ్మెల్యేకు కుర్చీ వేయకపోవడం దుర్మార్గమన్నారు. అలా వేసే చట్టం లేదని వారు చెబుతున్నారని దానికి తాము కూడా సమర్థిస్తామన్నారు. అయితే గతంలో కమలాపురం ఎమ్మెల్యే, కడప ఎమ్మెల్యేను ఎలా ఇరువైపుల కూర్చోబెట్టుకున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి రూ.4500 కోట్లు ఎంపీపీ, జడ్పీటీసీలకు మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అదే జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒక్కపైసా అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. అలాగే ఆర్థిక సంఘం నిధులు రూ.2000 కోట్లు ఇచ్చిన విషయాన్ని కూడా గుర్తుచేశారు.



జవహర్‌బాబును పరామర్శిస్తున్న రాజేంద్రప్రసాద్

దౌర్జన్యంగా భూమిని లాక్కున్నారు

● అన్నీ ఉన్నా పొలంలోకి రానివ్వడం లేదు ● పీజీఆర్ఎస్‌లో ములకలచెరువు రైతు ఫిర్యాదు

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో భూఅక్రమాలకు కేరాఫ్‌గా మారిన జిల్లా ప్రభుత్వం మారినా కొందరు అదే రీతిలో తమ అక్రమాలను కొనసాగిస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌లో 70 శాతం అర్జీలు అన్నీ కూడా భూఆక్రమణలకు పాల్పడ్డారని బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లె గ్రామంలోని యండపల్లి పొలం సర్వే నెంబర్ 1479/3లో 4.65 ఎకరాలను డి.ఆదెప్ప అనే రైతుకు 1977లో ప్రభుత్వం డీకేటీ పట్టా ఇచ్చింది. అయితే అతను కుటుంబ పోషణ భారమై అంగళ్లు చేరుకుని అక్కడ టమోటా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే అదునుగా తీసుకుని రెవెన్యూ వారు అతడి భూమిని వేరొక వారికి పాస్‌బుక్కులు ఇచ్చారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయంపై రెవెన్యూ వారిని అడగ్గా వారు నీవు ఊర్లో లేవు కాబట్టి ఆ భూమిని మేము వేరే వారి పేరుతో మార్చేశాము. నీకేమీ సంబంధం లేదు. ఇక్కడి నుంచి వెళ్లిపోండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేగాకుండా పొలంలోకి రాకుండా కొంతమంది దౌర్జన్యానికి దిగి తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదే విషయాన్ని గత ప్రభుత్వం నుంచి దాదాపు పదిసార్లు అర్జీలు ఇచ్చినా ఏ అధికారి పట్టించుకోలేదని వాపోయాడు. ఈ విషయంపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపి పొలం నాకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నాడు. అదేవిధంగా కురబలకోట మండలం తెట్టు గ్రామం కొరివివారిపల్లెలో ఉండే వెంకటరమణ అనే రైతుకు వారసత్వంగా 1241/4లో 5.13 ఎకరాలు ఉండేది. అయితే ఇప్పటికీ కూడా ఆయన పేరే ఆన్‌లైన్‌లో ఉందని, వన్‌బీ కూడా వస్తుందని తెలిపాడు. రెవెన్యూ వారి మాయాజాలంతో ఆ భూమిని వేరొకరు ఆక్రమించుకుని దౌర్జాన్యానికి దిగుతున్నారని వెంకటరమణ పీజీఆర్ఎస్ లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

నాణ్యతే ప్రామాణికంగా సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

నాణ్యతే ప్రామాణికంగా పీజీఆర్ఎస్ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఎస్డీసీ రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికం కావాలి. అర్జీదారుల సమస్యలను అత్యంత నాణ్యతగా పరిష్కరించినప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులు ఎన్ని వచ్చాయి. ఎప్పుడు వచ్చాయి. ఫీల్డ్‌కు వెళ్లారా, విచారణ చేశారా, నోటీసులు ఏమైనా ఇచ్చారా, తదుపరి ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

14 రోజుల్లో నిర్మాణం సాధ్యమేనా...?

- కోర్టు కేసులతో ఆగిన రోడ్డు పనులు
- 20 కిలోమీటర్ల ప్రయాణం నరకం
- నాలుగు నెలలుగా వాహనదారుల ఇక్కట్లు

మదనపల్లె టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె-తిరుపతి మధ్య జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) నాలుగు లేన్ల విస్తరణ నిర్మాణాలు నెమ్మదించాయి. ముఖ్యంగా మదనపల్లె-వాల్మీకిపురం మధ్య నాలుగు కిలోమీటర్ల మేర భూసేకరణ కాకపోవడంతో నాలుగు నెలలుగా జాతీయ రహదారి నిర్మాణం నెమ్మదించింది. దీంతో మదనపల్లె- వాల్మీకిపురం మధ్య 20 కిలోమీటర్ల ప్రయాణికులకు నరకంగా మారింది. దీనికంతటికి నష్టపరిహారం విషయంలో అటు నిర్వాసితులు, ఇటు ఎన్‌హెచ్ అధికారులు కోర్టుల్లో కేసులు వేయడమే కారణంగా తెలుస్తోంది. మదనపల్లె-తిరుపతి మధ్య నాలుగు లేన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఏఐ ద్వారా 118 కిలోమీటర్ల పొడవునా నాలుగు లేన్ల రహదారికి భారతమాల పరియోజన పథకం కింద ఐదేళ్ల క్రితం శ్రీకారం చుట్టింది. జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) నిర్మాణానికి భూసేకరణ, సర్వే తదితర అంశాలపై మూడేళ్ల పాటు అధికారులు మల్లాగుల్లాలు పడ్డారు. ఎట్టకేలకు మదనపల్లె-పీలేరు మధ్య 55.9 కిలోమీటర్లు, పీలేరు-తిరుపతి మధ్య 55.9 కిలోమీటర్ల నిర్మాణాలకు రెండు దశలుగా ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1,577 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతోనే భూసేకరణతో పాటు, రహదారి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.



తట్టివారిపల్లె వద్ద అస్తవ్యస్తంగా వున్న నాలుగురోడ్ల కూడలి



ఆరోగ్యవరం వద్ద నిలిచిపోయిన నాలుగు లేన్ల రహదారి నిర్మాణం



ఆరోగ్యవరం వద్ద నిలిచిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు

పెరిగిన భూసేకరణ వ్యయం

ఎన్‌హెచ్-71 రహదారి నిర్మాణానికి మదనపల్లె-పీలేరు మధ్య 55.9 కిలోమీటర్ల మేర భూసేకరణ చేశారు. 2015 సంవత్సరానికి ముందు జాతీయ రహదారుల భూసేకరణకు హెక్టార్‌కు రూ.80 లక్షలు ఉండగా పెరిగిన భూవిలువల ఆధారంగా ప్రస్తుతం హెక్టార్‌కు రూ.3.60 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ ప్రాజెక్టు వ్యయం గణనీయంగా పెరిగిపోయింది. గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు, పట్టణాల వెలుపల బైపాస్ రోడ్లు వెరసి వందలాది ఎకరాల భూసేకరణ చేశారు. ఒక కిలోమీటర్ భూసేకరణకు రూ.9 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా. ఈ క్రమంలో 55.9 కిలోమీటర్లకు రూ.540 కోట్ల వరకు భూసేకరణకు వ్యయం అయినట్లు తెలుస్తోంది.

రెండేళ్ల గడువులో ఇక మిగిలింది 15 రోజులే

మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి జీఆర్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ టెండర్ దక్కించుకుని 2023 జనవరి 14వ తేదీ పనులు ప్రారంభించింది. 55.9 కిలోమీటర్ల మేర పీలేరు నుంచి ఆరోగ్యవరం వరకు నాలుగు లేన్ల నిర్మాణ పనులు సజావుగానే సాగాయి. కానీ మదనపల్లె మండల ఆరోగ్యవరం నుంచి తట్టివారిపల్లె జంక్షన్ వరకు నాలుగు కిలోమీటర్ల పనులు నాలుగు నెలలుగా నిలిచిపోయాయి. మదనపల్లె సమీపంలో ఈ భూముల ధరలు బహిరంగ మార్కెట్‌లో ఎక్కువగా ఉండటం, భూసేకరణ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇచ్చే పరిహారం తక్కువ ఉందని నిర్వాసితులు అభ్యంతరాలు చేశారు. అంతేకాకుండా హైకోర్టుకు వెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆర్బిట్రేషన్ చేసి నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించారు. కలెక్టర్ ఇచ్చిన ఆర్బిట్రేషన్ ప్రకారం నష్టపరిహారం నిబంధనల ప్రకారం ఎక్కువ ఉందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు హైకోర్టుకు వెళ్లారు. ఇలా ఇరువర్గాలు కోర్టుకు వెళ్లడంతో ఆరోగ్యవరం నుంచి తట్టివారిపల్లె జంక్షన్ వరకు నాలుగు నెలలుగా జాతీయరహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా నిర్మాణ సంస్థ చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లలో అంటే 2025 జనవరి 12వ తేదీ లోపు 55.9 కిలోమీటర్ల నిర్మాణం పూర్తి చేయాలని షరతు ఉంది. అంటే ఇక మిగిలింది కేవలం 14 రోజులే. ఇంత తక్కువ సమయంలో నాలుగు కిలోమీటర్ల నాలుగు లేన్ల నిర్మాణం పూర్తి చేయాలంటే అసంభవమే.

వెంకప్పకోట రెవెన్యూ గ్రామాల్లోని సర్వేనెంబర్ 1/1, 1/2, 1/3 పోతబోలు గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 25/2, 90/1ఏ, 1బీ, 92/1ఏ సర్వే నెంబర్లలో ఎన్‌హెచ్-71 వెళుతోంది. ఇక్కడ చదరపు మీటరుకు రూ.3,669 నష్టపరిహారం చెల్లించేలా కలెక్టర్, జేసీలు అవార్డు పాస్ చేశారు. కానీ ఈ సర్వే నెంబర్లలో అంత సొమ్ము పరిహారంగా తాము ఇవ్వలేమని ఎన్‌హెచ్ అధికారులు తెల్పి చెప్పి చిత్తూరు కోర్టులో కేసు వేసినట్లు సమాచారం. అలాగే పోతబోలు గ్రామంలో ఇళ్ల స్థలాల విలువ బదులు, పొలం భూముల విలువలు వేసి పరిహారం చెల్లిస్తామనడంతో ఇక్కడ ఇళ్ల స్థలాల యజమానులు కోర్టులో కేసులు వేశారు. ఒకవేళ పరిహారం పెంచి బాధితులకు న్యాయం చేసేలా కలెక్టర్ పరిహారం పెంచినా ఎన్‌హెచ్ అధికారులు అంత పరిహారం చెల్లించలేమని మళ్లీ కోర్టులో కేసులు వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎంకిపెళ్లి సుబ్బిచావుకు వచ్చిందన్న చందంగా 50 కిలోమీటర్లు మేర వేగంగా ఎన్‌హెచ్ పనులు, బ్రిడ్జిల నిర్మాణం, ఫ్లైఓవర్, రైలు ఓవర్ బ్రిడ్జిలు పూర్తి అయినా, నాలుగు కిలోమీటర్లలో మాత్రం పనులు నిలిచిపోయాయి.

20 కిలోమీటర్ల ప్రయాణానికి 45 నిమిషాలు

మదనపల్లె-వాల్మీకిపురం మధ్య 20 కిలోమీటర్ల ప్రయాణానికి డబుల్ రోడ్డులో అయితే 30 నిమిషాల సమయం పడుతుంది. కానీ ఇప్పుడు 20 కిలోమీటర్ల ప్రయాణం 45 నుంచి 50 నిమిషాలు పడుతోంది. తట్టివారిపల్లె జంక్షన్ నుంచి ఆరోగ్యవరం దిగువ వరకు నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. ఈ నాలుగు కిలోమీటర్ల పరిధిలో 12 స్పీడ్ బ్రేకర్లు వేశారు. ఇదిలా ఉంటే మిగిలిన 16 కిలోమీటర్ల మేర ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు పెట్రోల్ బంకుల వద్ద, ఇతర ప్రదేశాల్లో 10 చోట్ల స్పీడ్‌బ్రేకర్లు వేశారు. మొత్తం మీద 20 కిలోమీటర్లకు 28 స్పీడ్‌బ్రేకర్లు దాటుకుని వెళ్లాలంటే వాహనదారులు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కొంతమంది మదనపల్లె నుంచి తిరుపతి వెళ్లాలంటే భయపడి చిత్తూరు మీదుగా తిరుపతి వెళుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, ప్రజలను సమన్వయం చేసుకుని రహదారి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

కోర్టు కేసుల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



తట్టివారిపల్లె జంక్షన్ నుంచి ఆరోగ్యవరం వరకు భూసేకరణకు అడ్డంకిగా మారిన కోర్టు కేసుల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాము. భూములు కోల్పోతున్న వారితో ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపాము. వారికి న్యాయమైన పరిహారం అందించేందుకు కృషి చేసేందుకు ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అవుతాయని ఆశిస్తున్నాము.

- మేఘస్వరూప్, సబ్‌కలెక్టర్, మదనపల్లె.

రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్

- ఒకరికి కత్తిపోట్లు.. టాటూ షాపు దహనం
- ఇద్దరిపై దాడులు

రాయచోటి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ చోటా నాయకుడి అనుచరులుగా చెప్పుకునే ఈ బ్యాచ్ అరాచకం సృష్టించింది. బాధితుల కథనం మేరకు.. సోమవారం సాయంత్రం ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న అక్క కూతురిని ఇంటికి తీసుకెళ్లేందుకు రాహుల్, కృష్ణకుమార్ నాయక్ ఇద్దరు వెళ్లారు. ఒకసారిగా సదరు నాయకుడి అనుచరులుగా చెప్పుకునే ఓ పది మంది వీళ్లపై విచక్షణారహితంగా దాడి చేశారు. అనంతరం ఇద్దరినీ తమతో పాటు తీసుకెళ్లిపోయారు. వాళ్ల నుంచి రాహుల్ ఎలాగో తప్పించుకుని బయటపడ్డాడు. తమతో పాటే కృష్ణకుమార్‌నాయక్‌ను తీసుకెళ్లిపోయారు. ఈ విషయాన్ని రాహుల్ తన బంధువులు, స్నేహితులకు తెలియజేశాడు. కృష్ణకుమార్‌నాయక్ కనిపించకుండా పోయిన విషయాన్ని తెలుసుకున్న అతడి స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సాయంత్రం 6 గంటల సమయంలో గున్నికుంట్ల ఇనాత్‌ఖాన్ చెరువు సమీపంలో కృష్ణకుమార్‌నాయక్‌ను కొడుతున్న విషయం అతడి స్నేహితులకు చెప్పారు. దీంతో అతడిని విడిపించుకు రావడానికి కొందరు వెళ్లారు. వాళ్ల మీద కూడా దాడి చేసి విజయ్ అనే యువకుడి చేతిపై కత్తితో పొడిచారు. దీంతో హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. వీళ్లను పోలీసులు విచారిస్తుండగానే గంజాయి బ్యాచ్ మరోసారి రెచ్చిపోయింది. చేతుల్లో దెబ్బలు తిన్న ఓ యువకుడు కొత్తపేటలో టాటూ షాపు నిర్వహించుకుంటున్నాడు. ఈ షాపును గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి దహనం చేశారు. షాపు పూర్తిగా కాలిపోయింది. దీంతో ఒకసారిగా పట్టణంలో భయానక వాతావరణం నెలకొంది. అగ్నిమాపక వాహనం వచ్చి మిగిలిన షాపులకు మంటలు వ్యాపించకుండా నిరోధించారు. దీంతో వెంటనే ఎస్ఐలు నరసింహారెడ్డి, జహీర్‌లు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే ఆ నాయకుడి అనుచరుల పేరుతో కొంతమంది యువకులు గత కొన్ని నెలలుగా పట్టణంలో అరాచకాలు సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గంజాయి తాగడం, ప్రతిరోజూ ఎవరో ఒకరిని కొట్టడమే పనిగా పెట్టుకున్నారని బాధితులు వాపోతున్నారు. వీళ్ల దాడికి గురైన పలువురు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా భయపడుతున్నారని సమాచారం. ఇటువంటి అరాచక శక్తులపైన పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



కాలిపోతున్న టాటూ షాపు

విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ప్రతినిధులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంతో విద్యా, పరిశోధన, సాంస్కృతిక రంగాలలో సహకారాన్ని పెంపొందించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి వెళ్లారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా ఫైన్ ఆర్ట్స్ సాంస్కృతిక రంగాలలో ఇరు సంస్థల నైపుణ్యాలను పరస్పరం వినియోగించుకునేందుకు వీలు కలుగనుందన్నారు. ఈ ఒప్పందం కింద ఇరు విశ్వవిద్యాలయాలు కలిసి పలు కార్యక్రమాలను చేపట్టనున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ విశ్వనాథ్‌కుమార్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఫైన్ ఆర్ట్స్, సంస్కృతిని పరిరక్షించడం, ప్రోత్సహించడం అనివార్యమన్నారు. ఈ ఒప్పందం రాబోయే తరం కళాకారులు, విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడనుంది. రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి అంగవైకల్యం అడ్డు రాకూడదు

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్
- డిప్యూటీ సీఎం చొరవతోనే దివ్యాంగులకు స్కూటర్ల పంపిణీ : కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి అంగవైకల్యం అడ్డు రాకూడదని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లాకు చెందిన ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, వర్చువల్‌గా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా ఉచిత స్కూటర్లను పంపిణీ చేశారు. దివ్యాంగులైన లక్కిరెడ్డిపల్లె మండలం కాపుపల్లి గ్రామానికి చెందిన కట్ట ఆదినారాయణ, వేములవాండ్లపల్లెకు కాల్వ చంద్రశేఖర్‌లకు రెండు లక్షల రూపాయలతో కొన్న 2 రెట్రోఫిటెడ్ మోటార్ స్కూటర్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంతో చొరవ చూపి తన సొంత బడ్జెట్ నుంచి రెండు లక్షలు కేటాయించి వాహనాలను కొని లబ్ధిదారులకు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఇది వారికి చాలా చిన్న ఉపశమనమే అయినప్పటికీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి తన పెద్ద మనసును చాటుకోవడం ద్వారానే ఇంత మంచి కార్యక్రమాన్ని చేయగలిగామని తెలిపారు. శనివారం రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆదినారాయణ, చంద్రశేఖర్‌లు ఉపముఖ్యమంత్రిని కలిసిన సందర్భంగా ఆయన ఆదేశాల మేరకు రెండు స్కూటర్లను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, విభిన్న ప్రతిభావంతులశాఖల జిల్లా అధికారి కృష్ణకిశోర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్ల పంపిణీలో కలెక్టర్ శ్రీధర్, తదితరులు

వేగవంతంగా బ్రహ్మోత్సవాల పనులు

- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు పనులు వేగవంతం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అన్నారు. సోమవారం దేవునికడప బ్రహ్మోత్సవాల్లో భాగంగా కడపకు వెళుతూ కోదండరామాలయం చేరుకుని రాబోయే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. బ్రహ్మోత్సవాలకు మరో మూడు నెలలకు మాత్రమే సమయం ఉండడంతో భక్తులకు అవసరమయ్యే పనులను వేగవంతం చేయాలని వీటితో పాటు రామాలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఆయన సమీక్షించారు. రామాలయం వద్ద గ్రీనరీని పెంచాలని, వాటి కోసం ప్రత్యేక ప్లాంటేషన్‌ను చేపట్టాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. రామాలయం చుట్టూ ఉన్న పార్కులను సుందరీకరణ చేపట్టాలని తెలిపారు. వీటితో పాటు భక్తులకు సేద తీరేందుకు పార్కుల్లో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కల్యాణవేదిక వద్ద పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల్యాణోత్సవానికి హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక ప్రణాళికలతో పనులు చేపట్టాలని సూచించారు. ప్రసాదాలు పంపిణీ, తలంబ్రాల పంపిణీ వంటివాటిపై ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేసి అందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ సుమతి, డీఈ వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో శ్రీనివాసులు, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసులు, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పనులపై అధికారులతో చర్చిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

శాంతిభద్రతలను పరిరక్షించాం

- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాం
- కోటి 87 లక్షల విలువ చేసే 1252 మొబైల్ ఫోన్‌ల రికవరీ
- 8878 సీసీ కెమెరాలతో జిల్లాను నిఘా నేత్రంగా తీర్చిదిద్దాం
- మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేసిందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను పటిష్టపరిచి ప్రజల సహకారంతో శాంతిభద్రతలను పరిరక్షించామని తెలిపారు. మహిళా పోలీసులతో తరచూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ మహిళలు, బాలికల్లో చట్టపరంగా చైతన్యపర్చడమే కాకుండా ప్రజలు సైబర్ క్రైం బారిన పడకుండా అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించామన్నారు. ఈ ఏడాదిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఆరుగురిని జిల్లా బహిష్కరణ చేశామన్నారు. సైబర్ క్రైం ద్వారా నష్టపోయిన బాధితులకు రూ.2 కోట్ల 47 లక్షల 57 వేల 540 రికవరీ చేసి అప్పగించామని చెప్పారు. జిల్లాలో నేరాల కట్టడి కోసం జిల్లా వ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో 8878 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక కృషి

జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను పటిష్టపరిచి శాంతిభద్రతలను పకడ్బందీగా అమలు చేయడమే కాకుండా విజిబుల్, ప్రివెంటివ్ పోలీసింగ్‌తో శాంతిభద్రతల పరంగా సున్నితమైన అంశాలను ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి సామరస్యంగా పరిష్కరించామన్నారు. 2024లో రూ.5 కోట్ల 19 లక్షల 68 వేల 696లు ప్రాపర్టీ లాస్ జరగగా అందులో నుంచి రూ.2 కోట్ల 12 లక్షల 36 వేల 772లు రికవరీ చేశామన్నారు. హత్యలు, అత్యాచారాలు, హత్యాప్రయత్నాలు, దొంగతనాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో కేసులు, ఛీటింగ్ కేసులు, సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు తదితర భూసమస్యల కేసులు 2023 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 4289 కేసు నమోదు దాకా 2024లో 3616 కేసులు నమోదయ్యాయన్నారు. 2024లో రోడ్డు ప్రమాదాలు 643 జరగగా అందులో 349 మంది మృతి చెందగా 814 మంది గాయపడ్డారన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కింద 1470 కేసు నమోదు కాగా 43,606 మందికి రూ.కోటి 13 లక్షల 5 వేల 045లో జరిమానా విధించామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు 7 కేసులు నమోదు చేసి 54 మంది నిందితులను గుర్తించడంతో పాటు అందులో 25 మంది ఎర్రచందనం స్మగ్లర్లు, కూలీలు, మేస్త్రీలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.56 లక్షల 63 వేల 246 విలువ గల 2,451 కేజీల బరువు గల 83 ఎర్రచందనం దుంగలతో పాటు 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

చోరీ కేసుల్లో...

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 800 గ్రాముల బంగారు నగలతో పాటు 17 కేజీల వెండి, 86 లక్షల నగదు రికవరీ చేశామన్నారు. అలాగే సుండుపల్లె, మదనపల్లె, ముదివేడు ప్రాంతాల్లో మహిళలను చంపిన, అత్యాచారం కేసుల్లో నలుగురికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన మొబైల్ ఫోన్ మిస్సింగ్ కేసుల్లో రూ.ఒక కోటి 87 లక్షల 80 వేల విలువ గల 1252 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా జూదం ఆడుతున్న 2537 మందిపై 418 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 63 లక్షల 47 వేల 664 నగదును 43 సెల్‌ఫోన్లను, 100 వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కోడిపందెం ఆడుతున్న 560 మందిని అరెస్టు చేసి 89 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 9,74,900 నగదును, 16 సెల్‌ఫోన్లు, 257 కోడిపుంజులు, 77 కోడికత్తులు, 109 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే మట్కా ఆడుతున్న 15 మందిని అరెస్టు చేసి 6 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.53,230లు నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అంతేగాక ఆయుధాల నిరోధక చట్టం కింద 19 మందిని అరెస్టు చేసి వారిపై 13 కేసులు నమోదు చేసి అక్రమంగా కలిగి ఉన్న 15 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పేలుడు పదార్థాల నిరోధక చట్టం కింద 9 మందిని అరెస్టు చేసి రెండు కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 13 బాంబులు, జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బియ్యం అక్రమ రవాణా కింద 40 మందిని అరెస్టు చేసి 24 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 2,06,572 కిలోల బరువు గల 4578 బియ్యం బస్తాలు 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నాటుసారా తయారీ విక్రయాల కింద 114 కేసులు నమోదు చేసి 1168 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 5055 లీటర్ల నాటుసారాతో పాటు 5834 లీటర్ల అక్రమ మద్యం, 13,475 లీటర్ల నాటుసారా ఊటను నాశనం చేయడంతో పాటు 53 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అలాగే మాదకద్రవ్యాల నిర్మూలన చట్టం కింద 126 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 258 కేజీల గంజాయితో పాటు 6 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అంతేగాక ఇసుక అక్రమ రవాణా విషయంలో 214 మందిపై 136 కేసులు నమోదు చేసి 143 ట్రాక్టర్లు, 17 లారీలు, 7 జేసీబీలు సీజ్ చేసి వెయ్యి టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే గల్ఫ్‌దేశాల్లో ఇబ్బందులు పడుతున్న జిల్లా వాసులను స్వదేశానికి తీసుకురావడానికి కృషి చేశామన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులతో పాటు సిబ్బంది సమిష్టిగా కృషి చేసి 2023 కన్నా 2024 సంవత్సరంలో నేరాలను అదుపు చేయడంలో కీలకపాత్ర పోషించే 15 శాతం తగ్గించేందుకు కృషి చేశామని, రాబోయే 2025 సంవత్సరంలో కూడా ఇదే అంకితభావంతో పనిచేసే నేరాలను కట్టడి చేస్తామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రితో పాటు రాయచోటి, రాజంపేట, మదనపల్లె డీఎస్పీలు కృష్ణమోహన్, సుధాకర్, కొండయ్యనాయుడు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, చిత్రంలో పోలీసు అధికారులు

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు


ఆత్మహత్యకు పాల్పడ్డ పల్లవి

పులివెందులటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. పట్టణ పరిధిలోని సమతానగర్, భాకరాపురం వీధిలో నివాసం ఉంటున్న మాలేపాటి పల్లవి (26)కు 8 ఏళ్ల కిందట సునీల్ కుమార్‌రెడ్డితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా భర్త హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ సంవత్సరం క్రితం కంపెనీ మూసివేసినందున ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తన పిల్లలను స్కూలు వద్ద వదిలిపెట్టి ఇంటికి తిరిగి వచ్చేసరికి బెడ్‌రూముకు లాక్ చేసుకొని ఉంది. భర్త, బంధువులు ఎంత పిలిచినా పలకకపోవడంతో డోరు పగులగొట్టి చూడగా ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు బంధువులు పులివెందుల అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీని సద్వినియోగం చేసుకోండి

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి


ప్రథమ విజేతకు బహుమతిని అందిస్తున్న గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ ద్వారా మీ వస్తువులను నేరుగా మీ ఇళ్ల వద్దకే చేరవేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి సూచించారు. ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను పురస్కరించుకుని (ఈ నెల 20 నుంచి వచ్చే జనవరి 19 వరకు) డోర్ డెలివరీలను ప్రోత్సహించడంలో భాగంగా డోర్ డెలివరీ బుక్ చేయు వినియోగదారులకు ప్రోత్సాహక బహుమతులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి ఈనెల 30, జనవరి 6, 13, 19 తేదీలలో ఇవ్వనున్నారు. అందులో భాగంగా మొదటి విడతగా సోమవారం స్థానిక కడప కార్గో కార్యాలయ ఆవరణంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో మొదటి విజేతగా కిరణ్‌కుమార్ (కడప), ద్వితీయ విజేతగా (కడప) తృతీయ విజేతగా ఎంపీఎల్ ఏజెన్సీ (కడప) నిలిచారు. విజేతలకు ఆర్ఎం చేతులమీదుగా బహుమతి ప్రదానం గావించారు. కార్యక్రమంలో కార్గో ఏటీఎం కమర్షియల్ జనార్ధన్, కడప డిపో మేనేజర్ ఢిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను తక్కువ చేస్తే సహించేది లేదు


- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య


అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడితే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య హెచ్చరించారు. పార్లమెంటులో అమిత్‌షా అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు, లౌకిక ప్రజాస్వామిక సంస్థల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా కడప నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ భారతదేశం భిన్న సంస్కృతుల కలయికతో ఉందని, అనేక భాషలు, సంస్కృతులు, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఉన్నాయ, అటువంటి వైవిధ్యం కలిగిన దేశానికి ఒక రాజ్యాంగం రచించి అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. అటువంటి అంబేడ్కర్‌ను అమిత్‌షా తక్కువ చేసి మాట్లాడడం ప్రజలు క్షమించరన్నారు. అమిత్‌షాను మంత్రి మండలి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ హిందుత్వం ముసుగులో దేశ సంపదను ప్రభుత్వ రంగ సంస్థలు ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అదానీ, అంబానీలకు ఇతర కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. బీజేపీ హిందువుల ప్రయోజనాలు కాపాడలేదని, హిందుత్వం ముసుగులో వ్యాపారం చేస్తోందని అటువంటి బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. అమిత్‌షాను మంత్రి మండలి నుంచి తొలగించని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కమలాపురంరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని రైల్వేగేటు వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని స్వాతి (25) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మృతురాలు చెవిలో బ్లూటూత్ పెట్టుకొని ఫోన్ మాట్లాడుతూ వచ్చే రైలును గమనించకుండా ట్రాక్ దాటే ప్రయత్నం చేసిందని, ఈ క్రమంలో రైలు ఢీకొనిందని తెలిపారు. కాగా ఈమె కొప్పర్తి పారిశ్రామికవాడలో సీసీ కెమెరాల విభాగంలో పనిచేస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


రైలు ప్రమాదంలో మృతి చెందిన స్వాతి

పనులు వేగవంతం చేయాలి

● సీజీఎం అయూబ్‌ఖాన్


మాట్లాడుతున్న చీఫ్ జనరల్ మేనేజర్ అయూబ్‌ఖాన్

కడప నాగరాజుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద జరిగే పనులు వేగవంతం చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ అయూబ్‌ఖాన్ కాంట్రాక్టర్లకు సూచించారు. కడపలోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో జిల్లాలోని కాంట్రాక్టర్లతో ఎస్‌ఈ ఎస్.రమణ సమీక్ష సమావేశం నిర్వహించారు. చీఫ్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ పనుల నాణ్యతలో రాజీపడకుండా పనులు వేగవంతం చేసి గ్రామీణ ప్రాంత అభివృద్ధిలో తమవంతుగా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి దేశాభివృద్ధికి చిహ్నాలని గుర్తుచేశారు. ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా పల్లెలను పట్టణాలతో ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాల కల్పనలో అత్యంత ప్రధానమైన త్రిఫేజ్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. పల్లెలోని సింగిల్ ఫేజ్ కేబుల్ లైన్ల స్థానంలో త్రిఫేజ్ 5 వైర్ల ఎల్టీ లైన్‌ను కండక్టర్ ద్వారా ఏర్పాటు చేసి, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో త్రిఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి పల్లెల్లో ఉండే విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలియజేశారు. ఈ ప్రక్రియ ఎంత త్వరగా పూర్తయితే అంత త్వరగా గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేయవచ్చని తెలిపారు. తద్వారా పట్టణాలకు దీటుగా పరిశ్రమల ఏర్పాటుకు సులభతరం అవుతుందని తెలిపారు. కొంతమంది కాంట్రాక్టర్లు కొత్త లైన్లు వేసేందుకు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయని, పొలం గట్ల వెంబడి తీసుకెళ్లాలని సూచించారు. ఈ మహత్తర కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి, ప్రత్యేకంగా గృహాలకు విద్యుత్ వ్యవస్థ వేర్వేరుగా ఏర్పడుతుంది. తద్వారా 24 గంటల త్రిఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. ప్రజలు కూడా గ్రామీణ ప్రాంత అభివృద్ధికి తమవంతుగా కొత్తలైన్లు వేయుటకు ఆటంకాలు కలిగించకుండా తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ ఈఈలు నాగరాజు, శ్రీనివాసులు, డీఈఈలు, ఏఈఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రైతు కుటుంబీకులను పరామర్శించిన అధికారులు


నాగేంద్ర కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మేనేజరు రమణ, సిబ్బంది

సింహాద్రిపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల దుద్దెకుంట్ల గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న నాగేంద్ర తల్లిని పలువురు అధికారులు సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు సింహాద్రిపురం ప్రకృతి వ్యవసాయం సిబ్బంది.. నాగేంద్ర తల్లిని పరామర్శించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసినట్లయితే పెట్టుబడి ఖర్చు తగ్గి రైతుల ఆత్మహత్య శాతం తగ్గే అవకాశం ఉంటుందని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మేనేజరు ఐవీ రమణ పేర్కొన్నారు. అలాగే మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి నాగేంద్ర కుటుంబీకులను పరామర్శించి, భూ పత్రాలను పరిశీలించారు. అనంతరం ఏఓ వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి నాగేంద్ర పొలాన్ని పరిశీలించారు.

డ్వాక్రా మహిళ ఆత్మహత్యాయత్నం

● సంఘ సభ్యుల వేధింపులు, పేరును తొలగించారని మనస్థాపం


ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవి

రైల్వేకోడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘానికి చెందిన 2వ లీడర్ పేరును సంఘం నుంచి తొలగించారని బాధితురాలు సోమవారం వెలుగు కార్యాలయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ పరిధిలో ఉన్న దళితవాడకు చెందిన బైరాగిల దేవి అనే డ్వాక్రా మహిళ లక్ష్మి నరసింహ డ్వాక్రా గ్రూపులో 2వ లీడర్‌గా ఉంది. ఆమె ఆలస్యంగా డబ్బులు చెల్లిస్తోందని, తీసుకున్న రుణం సక్రమంగా ప్రతి నెలా చెల్లించడం లేదని ఆమెను గ్రూపు నుంచి తొలగించాలని సుమారు నాలుగు నెలల నుంచి సంఘంలోని కొందరు ప్రయత్నిస్తున్నారని బాధితురాలు తెలిపింది. తాను రూ.34,900 బాకీ ఉండగా దానిని బయట వడ్డీకి డబ్బు తెచ్చి చెల్లించానని, తాను తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లిస్తున్నానని తెలిపింది. కొత్తవారిని ఇద్దరిని సంఘంలోకి తీసుకోవాలని సంఘం సభ్యులు చూస్తున్నారని, తాను 30 ఏళ్లుగా సంఘంలో ఉంటున్నానని చెప్పినా సంఘం సభ్యులు పట్టించుకోవడం లేదని, తొలగింపు వ్యవహారం అధికారులకు తెలియకుండా యానిమేటర్ చేస్తున్నారని బాధితురాలు తెలిపింది. తాను వితంతువునని, తనకు ఒక బుద్ధిమాంద్యం గల కుమార్తె ఉందని కూలీనాలీ చేసుకుని జీవిస్తున్నానని, భర్త లేకపోయినా అల్లుడు నాగరాజు సాయంతో జీవనం గడుపుతున్నామని బాధితురాలు తెలిపింది. సంఘంలో తన పేరు తొలగిస్తున్నారని, తనకు రుణం ఇవ్వమని చెప్పినందుకు తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపింది. వెలుగు కార్యాలయంలో పురుగుల మందు తాగిన మహిళ అపస్మార స్థితికి చేరుకోవడంతో రైల్వేకోడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది.

మొత్తం డబ్బులు చెల్లించింది

డ్వాక్రా మహిళ దేవి తాను తీసుకున్న రుణానికి సంబంధించిన డబ్బులు చెల్లించిందని, ఆమెను సంఘంలో ఉంచుకోవాలని సంఘ సభ్యులకు చెప్పినట్లు రైల్వేకోడూరు వెలుగు ఏపీవో వసుంధర తెలిపారు. గ్రామంలో జరిగిన విషయాలు తనకు తెలియదని, దీనిపై సమగ్రంగా విచారణ చేస్తామని వివరించారు.

ఎస్‌హెచ్‌జీ ద్వారా ఉత్పత్తుల ప్రదర్శన


ఉత్పత్తులను పరిశీలిస్తున్న మెప్మా పీడీ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమాన్ని సోమవారం కడప నగరంలో మెప్మా పీడీ వైసురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ మార్కెట్ ద్వారా పట్టణ పరిధిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే క్రమంలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రదర్శనల ద్వారా వినియోగదారులకు స్థానిక ఉత్పత్తులను అందించడంతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధులు కల్పించబడతాయన్నారు. అదేవిధంగా వివిధ రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఒకయాప్‌ను రూపొందించి అందులో తమకు అవసరమైన సేవలను ఇంట్లో నుంచే బుక్ చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, వాషింగ్ మిషన్, ఏసీ, గీజర్, వాటర్ ఫిల్టర్ లాంటి పరికరాల మరమ్మత్తులతో పాటు బ్యూటీషియన్, మెన్ సెలూన్ లాంటి సేవలను ఈ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. ఈ సేవలకు చార్జీలను ముందుగానే నిర్ణయిస్తామని తెలిపారు. దీని ద్వారా వినియోగదారులు అధిక మొత్తంలో ఖర్చుచేసే పరిస్థితి తప్పుతుందన్నారు. అదేవిధంగా వివిధ రంగాల పనులు చేసే వారికి ఉపాధి అవకాశాలు కల్పించే పరిస్థితి కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్ నాగరాజు, సీఎంఎం రాజేశ్వరి, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వరిగడ్డి దగ్ధం

మైదుకూరురూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్యోతినగర్‌లో వరిగడ్డితో వెళుతున్న ట్రాక్టర్‌కు షార్ట్ సర్క్యూట్ తగిలి కొంత మేరకు వరిగడ్డి కాలిబూడిదైంది. సోమవారం చాపాడు మండలం శ్రీరాములపేటకు చెందిన కుచ్చుపాపా గంగులయ్య జ్యోతినగర్‌లో నివసిస్తున్న తన అల్లుడుకు వరిగడ్డిని ఇవ్వాలని శ్రీరాములపేట నుంచి జ్యోతినగర్‌కు తీసు కెళ్తున్నాడు. కాగా జ్యోతినగర్ వద్ద వరిగడ్డికి కరెంటు వైర్లు తగలి నిప్పులు రావడంతో అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే వరి చెత్తను కిందకు పడేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ యజమాని గంగులయ్యకు స్వల్పగాయాలయ్యాయి.

ప్రొద్దుటూరు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ రఫీపై దాడి

● ఆరుగురిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ ఎస్‌ఐ మహ్మద్‌రఫీపై కొందరు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి రూరల్ పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈ దాడి ఘటనకు సంబంధించి టూటౌన్ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ ధనుంజయ.. లింగమయ్య మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..

ఆదివారం రాత్రి 7 గంటలకు జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని చిన్నశెట్టిపల్లె క్రాస్ వద్ద బైకు-కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న రాజుపాళెంకు చెందిన లింగమయ్య, ప్రొద్దుటూరుకు చెందిన హర్ష అనే ఇద్దరు యువకులు కిందపడి గాయపడ్డారు. ప్రమాద ఘటనపై రూరల్ ఎస్‌ఐ మహ్మద్ రఫీకి సమాచారం రాగా యువకులను ఇద్దరిని ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం కడప కొండాయపల్లి చిన్నచౌక్‌కు చెందిన కారు డ్రైవరు కడలయ్యగారి వెంకటరెడ్డి (24)ని పోలీసు స్టేషన్లో విచారించి 35 (3) బీఎన్‌ఎస్ఎస్ కింద నోటీసులు ఇచ్చి పంపారు. ఇదిలా వుండగా ప్రమాదంలో గాయపడిన లింగమయ్యకు సంబంధించి రాజుపాళెంకు చెందిన వ్యక్తులు సంఘటన విషయం తెలుసుకొని రూరల్ పోలీసు స్టేషనుకు వచ్చి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవరును ఎందుకు వదిలేశారని డ్యూటీలో వున్న కానిస్టేబుల్స్ రమేష్, చిన్ననాగన్న, ఏఎస్‌ఐ జాఫర్ హుస్సేన్‌పై గట్టిగా అరుపులు అరిచి కేకలు వేశారు. ఈ విషయం రూరల్ ఎస్‌ఐ రఫీకి ఫోన్‌లో డ్యూటీలో వున్న పోలీసులు సమాచారం అందించగా ఆయన మఫ్టీలో స్టేషనుకు వచ్చారు. కాగా ఎస్‌ఐ రఫీతో కూడా లింగమయ్య సోదరుడు పెద్ద లింగమయ్య మరికొందరు వాగ్వాదానికి దిగారు. చట్టప్రకారం కారు డ్రైవరును నోటీసులు ఇచ్చి పంపామన్నా కూడా వినకుండా 'ఏందిరా నీతో మాట్లాడేది' అని ఎస్‌ఐ ఎడమ చెంపపై చేతితో కొట్టారు. దీంతో ఎస్‌ఐపై దాడి చేయడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించినందుకు లింగమయ్య, శివ, రాము, ప్రవీణ్, మేరీశాంతి మరి కొందరిపై టూటౌన్ పోలీసు స్టేషన్లో 364/24 అండర్ సెక్షన్ 121 (1) 132 రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్ చట్టం ప్రకారం ఎస్‌ఐ ధనుంజయ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్ధరాత్రి రోడ్లపైకి వస్తే చర్యలు

రాజంపేట టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అర్ధరాత్రి తాగి రోడ్లపైకి రాకూడదని సోమవారం డీఎస్పీ ఎన్.సుధాకర్, పట్టణ సీఐ ఎల్లమ రాజు, మన్నూరు సీఐ మహ్మద్ అలీ తెలిపారు. గతంలో న్యూఇయర్ వేడుకల్లో ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకలు మృతి చెందిన విషయం గుర్తు చేశారు. అర్ధరాత్రి వేళ మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గతంలో జరిగిన సంఘటనల ఆధారంగా బారికేడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. నూతన సంవత్సరం వేడుకలు జీవితాల్లో కొత్త వెలుగులు నింపేలా ఉండాలన్నారు.

రోల్ బాస్కెట్ బాల్ పోటీలో జతిన్, హర్షిత్ ప్రతిభ

రామాపురం, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన అండర్ -14 ఫోర్త్ రోల్ బాస్కెట్‌బాల్ పోటీలో చిట్వూరు పంచాయతీ ఏకిలపల్లికి చెందిన నాగిరెడ్డి జతిన్‌రెడ్డి, నాగిరెడ్డి, హర్షత్‌రెడ్డి గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ కార్తీక్‌రెడ్డి తెలిపారు. వీరు ప్రస్తుతం తిరుపతి క్యాండూర్ స్కూల్‌లో చదువుతున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు ప్రశంసించారు.

అభివృద్ధికి నోచుకోని ఆర్టీసీ బస్టాండు

● పిచ్చి మొక్కలతో నిండిన ఆవరణ ● మరుగుదొడ్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు



రైల్వేకోడూరు బస్‌స్టేషన్



ముఖద్వారానికి అడ్డంగా వేసిన కంప

రైల్వేకోడూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నిర్వహణ లేకపోవడంతో రైల్వేకోడూరు బస్టాండు అధ్వానంగా మారింది. పాలకులెవరూ పట్టించుకోకపోవడంతో ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ప్రయాణికుల సౌకర్యార్థం 1989లో అప్పటి రవాణాశాఖ మంత్రి తోట సుబ్బారావు, వ్యవసాయ శాఖమంత్రి బిజివేముల వీరారెడ్డి, పార్లమెంటు సభ్యుడు సుగవాసి పాలకొండ్రాయుడు, స్థానిక శాసన సభ్యుడు తూమాటి పెంచలయ్య ఆర్టీసీ బస్టాండు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ బస్టాండును 1993 నవంబరు 14న అప్పటి రవాణా శాఖ మంత్రి యం.వీ మైసూరారెడ్డి, రాష్ట్ర హోం శాఖ మంత్రి అలపాటి ధర్మారావు, రాజంపేట లోక్‌సభ సభ్యుడు అన్నయ్యగారి సా యిప్రతాప్, కోడూరు శాసనసభ్యుడు తూమాటి పెంచల య్య ప్రారంభించారు. అయితే, ఊరికి దూరంగా ఉంద ని, ట్రాఫిక్ అధికంగా ఉంటుందన్న సాకుతో కొంతకాలానికే ఆ బస్టాండుకు బస్సులు రావడం ఆగిపోయింది. దీంతో శాసనసభ్యుడు వడ్డి చెన్నయ్య మళ్లీ బస్‌స్టేషన్‌ను ప్రారం భించి బస్సులు నడిచే విధంగా కృషి చేశారు. కొంతకాలానికి మళ్లీ పరిస్థితి మొదటి కొచ్చింది. ఈ నేపథ్యంలో అప్పటి టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు ఆర్‌టీసీ కమిషనర్‌ను పిలిపించి సమస్య వివరించారు. అప్పటి నుంచి బస్సుల రాకపోకలు జరుగుతున్నాయి. అయితే, సుమారు 4 ఎకరాలకు పైగా ఉన్న బస్టాం డు ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ప్రహరీ గోడ లేక పోవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. నిర్వహణ లేక మరుగుదొడ్లు మూతపడ్డాయి. కొళా యిల వద్ద పాచిపట్టి ఉంది. ముఖద్వారానికి అడ్డంగా కంప వేయడంతో లోపలికి వెళ్లే దారి లేకుండా పోయింది. బస్‌స్టేషన్ అధ్వాన స్థితికి చేరుకున్నా పాల కులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి చేయడమే కాకుండా బస్సు డిపోను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బస్‌స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



చాలా ఏళ్లుగా రైల్వేకోడూరు బస్‌స్టేషన్ అభివృద్ధి చెంద లేదు. తాగునీరు లేదు. మరుగుదొడ్లు సక్రమంగా లేవు. వర్షాకాలంలో పైకప్పు ఉరుస్తోంది. పాలకులు పట్టించుకు ని అభివృద్ధికి కృషి చేయాలి

- చీనాకుల బాలాంజనేయులు

రవాణాశాఖ మంత్రి పట్టించుకోవాలి



అన్నమయ్య జిల్లా వాసి అయిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రైల్వేకోడూరు బస్‌స్టేషన్ అభివృద్ధికి కృషి చేయాలి. నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి. ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒక సారి మంత్రి పరిశీలించాలి.

- మందల రామకృష్ణ, వ్యాపారి

సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎమ్మెల్యే



సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని రైల్వేకోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని కేఆర్ కండ్రిగకు చెందిన కొండూరు సుబ్బరాజుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మం జూరైన రూ. 1,50,329 చెక్కును పంపిణీ చేశామని తెలిపారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం: ఆర్డీవో

గాలివీడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గేటు నాలుగురోడ్ల కూడలిలో ఆర్ అండ్ బీ రోడ్డు ఆక్రమణల తొలగింపు కారణంగా నిర్వాసితులైన వారితో సోమవారం అధికారులు చర్చించారు. ఇటీవల గాలివీడుకు వచ్చిన డిప్యూటీ సీఎంను కలిసిన నిర్వా సితులు తమకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు. అందుకు స్పందించిన ఆయన బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యామ్నాయం ఆలోచించాలని అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాసులు బాధితులతో చర్చించారు. ఆక్రమణలు తొలగించాల్సి వస్తే 1.80 ఎకరాల్లో ఉన్న నిర్మాణాలన్నీ తొలగించాలని, అలా కాకుండా నిరుపేదలమైన తమ నివాసాలు మాత్రమే తొలగించడం అన్యాయం అంటూ బాధితులు వాపోయారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆక్రమణలు ప్రోత్సహించలేమని, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

ఎంపీడీవోకు పరామర్శ

గాలివీడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎంపీడీవో జవహర్‌బాబును సోమవారం సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది పరామర్శించి ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు పార్థసారథిరెడ్డి, లక్ష్మినారాయణ, ఆచారి, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, వీరరాఘవులు, కల్యాణ్‌చక్రవర్తి, మొరార్జీ, జనార్దన్, ఏపీవోలు రామచంద్ర, హరి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవటం: రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య ఆయన ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

ఎంఆర్‌పీకే వస్తువులు విక్రయించాలి

రైల్వేకోడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ సీఐ నాగరాజు తెలిపారు. రైల్వేకోడూరులో సిగరెట్లు అధిక ధరలకు అమ్ముతున్నారని సమాచారం అందడంతో ఆదివారం దాడులు నిర్వహించి ఒకరిపై అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఎవరైనా ఎంఆర్‌పీ ధరలకు కాకుండా ఎక్కువగా ధరలకు సరుకులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు డీలర్ల నియామకం కోసం ఇంటర్వ్యూ

సుండుపల్లె, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): డీలర్ల నియామకానికి రాత పరీక్ష ఉత్తీర్ణులైన వారు ఈ నెల 31న రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సోమవారం తహసీల్దార్ దైవాధీనం తెలిపారు. రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

సుండుపల్లెమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

సుండుపల్లె, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): సుండుపల్లెమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆలయాన్ని ఆయన పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో సుండుపల్లెమ్మ ఆలయ స్థలానికి హద్దులు చూపించాలని వినతి పత్రాన్ని అందజేయడంతో రెవెన్యూ అధికారులు స్థలాన్ని హద్దులు ఏర్పాటు చేశారు. ఈ ఆలయ జీర్ణోద్ధరణకు సంబంధిత అధికారులు కృషి చేయాలని కోరారు. సర్వేయర్లు కీర్తన, జగదీశ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సుబ్బరాజు, సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు కెనరా బ్యాంకు లక్ష్యం

సుండుపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ బ్యాంకు లక్ష్యమని కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. సోమవారం ఆ బ్యాంకు సుండుపల్లె శాఖ 50వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాయచోటి క్లస్టర్ ఇన్‌చార్జి సతీశ్ బాబు, టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బరామరాజు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామా జగదీశ్, బ్యాంకు సిబ్బంది మల్లికార్జున, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

చిట్వేలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధితో ఇబ్బందులు పడుతున్న చిట్వేలి మండలం తిమ్మాయపాళేనికి చెందిన మోడెం చిరంజీవికి సోమవారం ముక్కా వరలక్ష్మి రూ. 1.50 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే శ్రీధర్ జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, యువ నాయకులు గుత్తి నరసింహ, మాదాసు నరసింహ, పురం సురేష్, వేణుగోపాల్‌రెడ్డి, రమణయ్య, బొంతల నాగేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి మండిపల్లి జిల్లాకు రాక

రాయచోటిటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం రాయచోటికి రానున్నారు. ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్‌లో పాల్గొంటారు. 9.30కు సంబేపల్లెమండలం ఎర్రగుంట్ల కస్తూరిబా గాంధీ పాఠశాలలో సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. 10 గంటలకు సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లెలో రెవెన్యూ సదస్సులో పాల్గొంటారు. 11.30కి సంబేపల్లె మండలంలోని దేవర రాయి నల్లగంగమ్మ గుడిని సందర్శిస్తారు. మధ్యా హ్నం 12 గంటలకు సంబేపల్లె మండలం దుద్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొంటారు. 12.30కు రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో సైన్స్ ఫెయిర్ (విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన) కార్యక్రమంలో పాల్గొంటారు. 2.30 గంటలకు కడప పట్టణంలోని ఎమ్మెల్సీ రామచంద్రయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు.

పుల్లంపేట బీజేపీ అధ్యక్షుడుగా మనోహర్‌రెడ్డి

పుల్లంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండల బీజేపీ అధ్యక్షుడుగా కమలాపురం మనోహర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పుల్లంపేటలో సోమవారం నిర్వహించిన ఈ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తోట శ్రీనివాసులు వ్యవహరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు గండికోట రామకృష్ణయ్య, నియోజకవర్గ కన్వీనర్ గద్దం చెంగల్‌రాజు, జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబరు రామసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు కంబాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

'గ్రీవెన్స్ డే'కు అధికారుల డుమ్మా..

రైల్వేకోడూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తహసీల్దారుతోపాటు వ్యవసాయ శాఖాధికారి సుధాకర్ తప్ప మరే అధికారి హాజరు కాలేదు. ఈ కార్యక్రమానికి ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, నీటిపారుదల, రోడ్లు భవనాలు, విద్య, మండల పరిషత్, ఫైర్, అటవీ, పోలీసు తదితర శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. ఆమేరకు సమాచారం అందించినా ఎవరూ హాజరు కాలేదని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ వివరించారు.

బస్సు, లారీ ఢీ - తప్పిన పెను ప్రమాదం

నందలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న వాహనాల హెడ్‌లైట్ల కారణంగా దారి కనిపించకపోవడంతో ఆర్టీసీ బస్సు లారీని ఢీకొంది. సోమవారం రాత్రి రాజంపేట నుంచి కడప వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, కడప నుంచి రాజంపేట వైపుకు వెళుతున్న లారీ ఢీకొంది. ప్రమాదం గమనించి బస్సు డ్రైవరు అప్రమత్తమై బ్రేకులు వేయడంతో బస్సు అద్దాలు మాత్రమే పగిలాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

విద్యుత్ చార్జీల పెంపు జగన్ పాపమే..

● రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సుగవాసి

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారంటూ కొత్త డ్రామాకు తెరలేపిన వైసీపీ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం హెచ్చరించారు. రూ. 1.29 వేల కోట్ల విద్యుత్ బకాయిలు ప్రజలపై మోపిన ప్రభుత్వం మీది కాదా అని గడికోట శ్రీకాంత్‌రెడ్డిని, ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని ప్రశ్నించారు. ఐదేళ్లలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై 32 వేలకోట్లు భారం మోపింది మీరు కాదా అని ప్రశ్నించారు. విద్యుత్ కొరత సృష్టించి బహిరంగ మార్కెట్‌లో అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేయడంతో వైసీపీ నేతల జేబులు నిండాయి తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఈ విషయాలపై బహిరంగ చర్చకు వస్తే తాను సిద్ధంగా ఉన్నానని వారు సవాల్ విసిరారు. ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉండేది టీడీపీ ప్రభుత్వమేనని తెలిపారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

●సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జీ. ఈశ్వరయ్య

రాయచోటిటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించుకుని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జాతికి క్షమాపణలు చెప్పడంతోపాటు మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జీ. ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో సీపీఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని, దేశంలో అన్ని రకాల వసువులపై జీఎస్టీ పేరుతో టాక్స్ పెంచుతూ ప్రజలపై భారాలు మోపారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల వాగ్దానాల నుంచి యూటర్న్ తీసుకున్నాడని విమర్శించారు. విద్యుత్ చార్జీలు ఏ మాత్రం పెంచమని వీలైతే తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. లోకేశ్ రాసుకున్న రెడ్‌బుక్ పేజీలు చిరిగి పోతున్నాయని, భూ కబ్జా కోరులు, అవినీతిపరులను కూటమి ప్రభుత్వంలో చేర్చుకుంటు న్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, , విశ్వనాథ్ నాయక్, సుమిత్రమ్మ, సుధీర్‌కుమార్, జ్యోతి, చిన్నయ్య, మురళి, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి సన్నిధిలో ఎస్‌బీఐ జీఎం



ఎస్‌బీఐ జీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

ఒంటిమిట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని సోమవారం స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా అమరావతి జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ కుటుంబ సమేతంగా సందర్శించారు. టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం సీతారామ లక్ష్మణులకు పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందజేశారు. రీజనల్ మేనేజర్ మురళీ నాయక్, బ్యాంకు మేనేజర్ జగదీష్, సిబ్బందితో కలిసి స్వామివారి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రీజ నల్ మేనేజర్ మురళీనాయక్, మేనేజర్ జగదీష్‌కుమార్, బ్యాంకు సిబ్బంది, చైతన్య, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

బొమ్మల తయారీకి ఎర్రచందనం ఇవ్వండి



అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీకి జ్ఞాపికను బహూకరిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొయ్య బొమ్మల తయారీకి ఎర్రచందనం కొయ్యను మంజూరు చేయాలని లక్ష్మీగారిపల్లె కొయ్యబొమ్మల కళాకారులు రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ చిరంజీవిచౌదరికి విన్నవించారు. సోమవారం అమరావతిలో లక్ష్మీగారిపల్లె కళాకారుడు సుబ్బరాయుడు ఆచారి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సంగరాజు రవికుమార్‌రాజుతో పాటు ఎర్రచందనం అసోసియేషన్ సభ్యులు, రైతులు తదితరులు పీసీసీఎఫ్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ తగిన కొయ్య లభించకపోవడంతో బొమ్మలు తయారు చేసే కళాకారులు ఇబ్బందులు పడుతున్నారని, రైతులు తమ పొలాల్లో ఉన్న ఎర్రచందనం చెట్లను అమ్ము కునేందుకు సైతం సమస్యలు ఎదురవుతున్నాయని, ఇతర రాష్ట్రాల్లోని నిబంధనల కారణంగా ఎర్రచందనం వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించామని తెలిపారు. దీంతో స్పందించిన పీసీఎస్ఎఫ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకునిపోయి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎర్రచందనం అసోసియేషన్ సభ్యులు ఎస్.రవికుమార్‌రాజు, కార్యదర్శి నాగయ్య, జాయింట్ కార్యదర్శి కొండేటి ఆంజనేయులు, లక్ష్మీగారిపల్లె కొయ్య కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి

పెనగలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా అధ్వానంగా మారిన పల్లంపాడు రహదారికి మరమ్మతులు చేయించాలంటూ ఆ గ్రామ పెద్దలు సోమవారం ఎంపీడీవో విజయరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ రహదారి దుస్థితిని గతంలోనే రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు

సిద్దవటం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు టక్కోలి గ్రామ రైతులు చర్యలు తీసుకున్నారు. మండలంలోని టక్కోలి గ్రామం పెన్నానది నుంచి ప్రతి రోజు జిల్లా కేంద్రానికి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించిన రైతులు సోమవారం పెన్నానదిలోనికి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా ఎక్స్‌కవేటర్లతో గోతులు తీయించారు.

చిన్నారుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలి



జిల్లా స్థాయికి ఎంపికైన నమూనాలతో విద్యార్థులు

సంబేపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడానికి వైజ్ఞానిక ప్రదర్శన తోడ్పడుతుందని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సోమ వారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో సంబేపల్లె హైస్కూల్ విద్యార్థిని ఆఫ్రా ప్రదర్శిం చిన సోలార్ పవర్ ఆటోమేటిక్ రైల్వేగేట్ సిస్టం ప్రాజెక్టు, సంబేపల్లె కేజీబీవీ విద్యార్థిని పూజిత ప్రదర్శించిన ప్రాజెక్టు, ఉపాధ్యా య విభాగంలో మార్ల ఓబుల్‌రెడ్డి ప్రదర్శించిన ప్లాస్టిక్ రెడ్యూసర్ ప్రాజెక్టు జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక య్యాయన్నారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జాండ్రపల్లె, పర్వతరెడ్డిగారిపల్లె, ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై జాండ్రపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు ప్రథమ స్థానం, కాలుష్య నివారణపై పర్వతరెడ్డిగారిపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి.

చిన్నమండెం: రాయచోటిలోని సందీప్ హైస్కూల్‌లో నిర్వహించిన విజన్ సైంటిఫిక్ ప్రాజెక్టు 2024లో మల్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు దినేశ్, భరత్‌లు ప్రదర్శించిన అగ్నిమాపక పరికరాల ప్రాజెక్టుకు మూడో బహుమతి, 9వ తరగతి అమృత, 8వ తరగతి హిమజ ప్రదర్శించిన హోంమేడ్ ఓడోనిల్ అను ప్రాజెక్టు ఆరో బహుమతి సాధించినట్లు ప్రకటించారు.

పుల్లంపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ విభాగంలో ఎస్‌టీవీడీ సభ, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎస్.ప్రహణ వ్యక్తిగత విభాగంలో కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఓంకార్, గ్రూపు విభాగంలో బి.ప్రశాంత్, మల్లికార్జునరాజు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

న్యాయవాది మృతిపై విచారణ చేయాలి



రాయచోటి కోర్టు ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 2024 అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి ఆయన మృతికి కారణమైన అనంతపురం త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌ను డిస్మిస్ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటిలో కోర్టు విధులను బహిష్కరించి కోర్టు గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి పీ. రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి డీ. నాగముని మాట్లాడు తూ సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం వద్దని సుప్రీంకోర్టు పదే పదే చెబుతున్నా సీఐ శాంతిలాల్ మాత్రం ఒక సీనియర్ న్యాయవాది అని కూడా చూడకుండా పదే పదే ఫోన్లు చేసి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అమర్యాదగా ప్రవర్తించడంతో ఈ దారుణ సంఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాది మృతికి బాధ్యత వహిస్తూ ప్రభుత్వం బాధిత కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

పెనగలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయాభివృద్ధిలో పాలుపంచుకునేందుకు నేటి యువత రాజకీయాల్లోకి రావాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి కోరారు. వీరబాల దివస్ పురస్కరించుకుని సోమవారం సాయంత్రం పెనగలూరు ఉన్నత పాఠశాలలో బాలల శౌర్య పరాక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు చిన్నారెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14 రోజుల్లో నిర్మాణం సాధ్యమేనా...?

- కోర్టు కేసులతో ఆగిన రోడ్డు పనులు
- 20 కిలోమీటర్ల ప్రయాణం నరకం
- నాలుగు నెలలుగా వాహనదారుల ఇక్కట్లు

మదనపల్లె టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె-తిరుపతి మధ్య జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) నాలుగు లేన్ల విస్తరణ నిర్మాణాలు నెమ్మదించాయి. ముఖ్యంగా మదనపల్లె-వాల్మీకిపురం మధ్య నాలుగు కిలోమీటర్ల మేర భూసేకరణ కాకపోవడంతో నాలుగు నెలలుగా జాతీయ రహదారి నిర్మాణం నెమ్మదించింది. దీంతో మదనపల్లె- వాల్మీకిపురం మధ్య 20 కిలోమీటర్లు ప్రయాణికులకు నరకంగా మారింది. దీనికంతటికి నష్టపరిహారం విషయంలో అటు నిర్వాసితులు, ఇటు ఎన్‌హెచ్ అధికారులు కోర్టుల్లో కేసులు వేయడమే కారణంగా తెలుస్తోంది. మదనపల్లె-తిరుపతి మధ్య నాలుగు లేన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఏఐ ద్వారా 118 కిలోమీటర్ల పొడవునా నాలుగు లేన్ల రహదారికి భారతమాల పరియోజన పథకం కింద ఐదేళ్ల క్రితం శ్రీకారం చుట్టింది. జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) నిర్మాణానికి భూసేకరణ, సర్వే తదితర అంశాలపై మూడేళ్ల పాటు అధికారులు మల్లాగుల్లాలు పడ్డారు. ఎట్టకేలకు మదనపల్లె-పీలేరు మధ్య 55.9 కిలోమీటర్లు, పీలేరు-తిరుపతి మధ్య 55.9 కిలోమీటర్ల నిర్మాణాలకు రెండు దశలుగా ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1,577 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతోనే భూసేకరణతో పాటు, రహదారి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.


తట్టివారిపల్లె వద్ద అస్తవ్యస్తంగా వున్న నాలుగురోడ్ల కూడలి


ఆరోగ్యవరం వద్ద నిలిచిపోయిన నాలుగు లేన్ల రహదారి నిర్మాణం


ఆరోగ్యవరం వద్ద నిలిచిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు

పెరిగిన భూసేకరణ వ్యయం

ఎన్‌హెచ్-71 రహదారి నిర్మాణానికి మదనపల్లె-పీలేరు మధ్య 55.9 కిలోమీటర్ల మేర భూసేకరణ చేశారు. 2015 సంవత్సరానికి ముందు జాతీయ రహదారుల భూసేకరణకు హెక్టార్‌కు రూ.80 లక్షలు ఉండగా పెరిగిన భూవిలువల ఆధారంగా ప్రస్తుతం హెక్టార్‌కు రూ.3.60 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ ప్రాజెక్టు వ్యయం గణనీయంగా పెరిగిపోయింది. గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు, పట్టణాల వెలుపల బైపాస్ రోడ్లు వెరసి వందలాది ఎకరాల భూసేకరణ చేశారు. ఒక కిలోమీటర్ భూసేకరణకు రూ.9 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా. ఈ క్రమంలో 55.9 కిలోమీటర్లకు రూ.540 కోట్ల వరకు భూసేకరణకు వ్యయం అయినట్లు తెలుస్తోంది.

రెండేళ్ల గడువులో ఇక మిగిలింది 15 రోజులే

మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి జీఆర్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ టెండర్ దక్కించుకుని 2023 జనవరి 14వ తేదీ పనులు ప్రారంభించింది. 55.9 కిలోమీటర్ల మేర పీలేరు నుంచి ఆరోగ్యవరం వరకు నాలుగు లేన్ల నిర్మాణ పనులు సజావుగానే సాగాయి. కానీ మదనపల్లె మండల ఆరోగ్యవరం నుంచి తట్టివారిపల్లె జంక్షన్ వరకు నాలుగు కిలోమీటర్ల పనులు నాలుగు నెలలుగా నిలిచిపోయాయి. మదనపల్లె సమీపంలో ఈ భూముల ధరలు బహిరంగ మార్కెట్‌లో ఎక్కువగా ఉండటం, భూసేకరణ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇచ్చే పరిహారం తక్కువ ఉందని నిర్వాసితులు అభ్యంతరాలు చేశారు. అంతేకాకుండా హైకోర్టుకు వెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆర్బిట్రేషన్ చేసి నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించారు. కలెక్టర్ ఇచ్చిన ఆర్బిట్రేషన్ ప్రకారం నష్టపరిహారం నిబంధనల ప్రకారం ఎక్కువ ఉందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు హైకోర్టుకు వెళ్లారు. ఇలా ఇరువర్గాలు కోర్టుకు వెళ్లడంతో ఆరోగ్యవరం నుంచి తట్టివారిపల్లె జంక్షన్ వరకు నాలుగు నెలలుగా జాతీయరహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా నిర్మాణ సంస్థ చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లలో అంటే 2025 జనవరి 12వ తేదీ లోపు 55.9 కిలోమీటర్ల నిర్మాణం పూర్తి చేయాలని షరతు ఉంది. అంటే ఇక మిగిలింది కేవలం 14 రోజులే. ఇంత తక్కువ సమయంలో నాలుగు కిలోమీటర్ల నాలుగు లేన్ల నిర్మాణం పూర్తి చేయాలంటే అసంభవమే.

వెంకప్పకోట రెవెన్యూ గ్రామాల్లోని సర్వేనెంబర్ 1/1, 1/2, 1/3 పోతబోలు గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 25/2, 90/1ఏ, 1బీ, 92/1ఏ సర్వే నెంబర్లలో ఎన్‌హెచ్-71 వెళుతోంది. ఇక్కడ చదరపు మీటరుకు రూ.3,669 నష్టపరిహారం చెల్లించేలా కలెక్టర్, జేసీలు అవార్డు పాస్ చేశారు. కానీ ఈ సర్వే నెంబర్లలో అంత సొమ్ము పరిహారంగా తాము ఇవ్వలేమని ఎన్‌హెచ్ అధికారులు తేల్చి చెప్పి చిత్తూరు కోర్టులో కేసు వేసినట్లు సమాచారం. అలాగే పోతబోలు గ్రామంలో ఇళ్ల స్థలాల విలువ బదులు, పొలం భూముల విలువలు వేసి పరిహారం చెల్లిస్తామనడంతో ఇక్కడ ఇళ్ల స్థలాల యజమానులు కోర్టులో కేసులు వేశారు. ఒకవేళ పరిహారం పెంచి బాధితులకు న్యాయం చేసేలా కలెక్టర్ పరిహారం పెంచినా ఎన్‌హెచ్ అధికారులు అంత పరిహారం చెల్లించలేమని మళ్లీ కోర్టులో కేసులు వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎంకిపెళ్లి సుబ్బిచావుకు వచ్చిందన్న చందంగా 50 కిలోమీటర్లు మేర వేగంగా ఎన్‌హెచ్ పనులు, బ్రిడ్జిల నిర్మాణం, ఫ్లైఓవర్, రైలు ఓవర్ బ్రిడ్జిలు పూర్తి అయినా, నాలుగు కిలోమీటర్లలో మాత్రం పనులు నిలిచిపోయాయి.

కోర్టు కేసుల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



తట్టివారిపల్లె జంక్షన్ నుంచి ఆరోగ్యవరం వరకు భూసేకరణకు అడ్డంకిగా మారిన కోర్టు కేసుల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాము. భూములు కోల్పోతున్న వారితో ఇప్పటికే పలు మార్లు చర్చలు జరిపాము. వారికి న్యాయమైన పరిహారం అందించేందుకు కృషి చేసేందుకు ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అవుతాయని ఆశిస్తున్నాము.

- మేఘస్వరూప్, సబ్‌కలెక్టర్, మదనపల్లె.

20 కిలోమీటర్ల ప్రయాణానికి 45 నిమిషాలు

మదనపల్లె-వాల్మీకిపురం మధ్య 20 కిలోమీటర్ల ప్రయాణానికి డబుల్ రోడ్డులో అయితే 30 నిమిషాల సమయం పడుతుంది. కానీ ఇప్పుడు 20 కిలోమీటర్ల ప్రయాణం 45 నుంచి 50 నిమిషాలు పడుతోంది. తట్టివారిపల్లె జంక్షన్ నుంచి ఆరోగ్యవరం దిగువ వరకు నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. ఈ నాలుగు కిలోమీటర్ల పరిధిలో 12 స్పీడ్ బ్రేకర్లు వేశారు. ఇదిలా ఉంటే మిగిలిన 16 కిలోమీటర్ల మేర ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు పెట్రోల్ బంకుల వద్ద, ఇతర ప్రదేశాల్లో 10 చోట్ల స్పీడ్‌బ్రేకర్లు వేశారు. మొత్తం మీద 20 కిలోమీటర్లకు 28 స్పీడ్‌బ్రేకర్లు దాటుకుని వెళ్లాలంటే వాహనదారులు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కొంతమంది మదనపల్లె నుంచి తిరుపతి వెళ్లాలంటే భయపడి చిత్తూరు మీదుగా తిరుపతి వెళుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, ప్రజలను సమన్వయం చేసుకుని రహదారి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్

- ఒకరికి కత్తిపోట్లు.. టాటూ షాపు దహనం ● ఇద్దరిపై దాడులు

రాయచోటి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ చోటా నాయకుడి అనుచరులుగా చెప్పుకునే ఈ బ్యాచ్ అరాచకం సృష్టించింది. బాధితుల కథనం మేరకు.. సోమవారం సాయంత్రం ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న అక్క కూతురిని ఇంటికి తీసుకెళ్లేందుకు రాహుల్, కృష్ణకుమార్ నాయక్ ఇద్దరు వెళ్లారు. ఒకసారిగా సదరు నాయకుడి అనుచరులుగా చెప్పుకునే ఓ పది మంది వీళ్లపై విచక్షణారహితంగా దాడి చేశారు. అనంతరం ఇద్దరినీ తమతో పాటు తీసుకెళ్లిపోయారు. వాళ్ల నుంచి రాహుల్ ఎలాగో తప్పించుకుని బయటపడ్డాడు. తమతో పాటే కృష్ణకుమార్‌నాయక్‌ను తీసుకెళ్లిపోయారు. ఈ విషయాన్ని రాహుల్ తన బంధువులు, స్నేహితులకు తెలియజేశాడు. కృష్ణకుమార్‌నాయక్ కనిపించకుండా పోయిన విషయాన్ని తెలుసుకున్న అతడి స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సాయంత్రం 6 గంటల సమయంలో గున్నికుంట్ల ఇనాత్‌ఖాన్ చెరువు సమీపంలో కృష్ణకుమార్‌నాయక్‌ను కొడుతున్న విషయం అతడి స్నేహితులకు చెప్పారు. దీంతో అతడిని విడిపించుకు రావడానికి కొందరు వెళ్లారు. వాళ్ల మీద కూడా దాడి చేసి విజయ్ అనే యువకుడి చేతిపై కత్తితో పొడిచారు. దీంతో హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. వీళ్లను పోలీసులు విచారిస్తుండగానే గంజాయి బ్యాచ్ మరోసారి రెచ్చిపోయింది. చేతుల్లో దెబ్బలు తిన్న ఓ యువకుడు కొత్తపేటలో టాటూ షాపు నిర్వహించుకుంటున్నాడు. ఈ షాపును గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి దహనం చేశారు. షాపు పూర్తిగా కాలిపోయింది. దీంతో ఒకసారిగా పట్టణంలో భయానక వాతావరణం నెలకొంది. అగ్నిమాపక వాహనం వచ్చి మిగిలిన షాపులకు మంటలు వ్యాపించకుండా నిరోధించారు. దీంతో వెంటనే ఎస్ఐలు నరసింహారెడ్డి, జహీర్‌లు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే ఆ నాయకుడి అనుచరుల పేరుతో కొంతమంది యువకులు గత కొన్ని నెలలుగా పట్టణంలో అరాచకాలు సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గంజాయి తాగడం, ప్రతిరోజూ ఎవరో ఒకరిని కొట్టడమే పనిగా పెట్టుకున్నారని బాధితులు వాపోతున్నారు. వీళ్ల దాడికి గురైన పలువురు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా భయపడుతున్నారని సమాచారం. ఇటువంటి అరాచక శక్తులపైన పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.


కాలిపోతున్న టాటూ షాపు

విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ప్రతినిధులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంతో విద్యా, పరిశోధన, సాంస్కృతిక రంగాలలో సహకారాన్ని పెంపొందించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి వెళ్లారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా ఫైన్ ఆర్ట్స్ సాంస్కృతిక రంగాలలో ఇరు సంస్థల నైపుణ్యాలను పరస్పరం వినియోగించుకునేందుకు వీలు కలుగనుందన్నారు. ఈ ఒప్పందం కింద ఇరు విశ్వవిద్యాలయాలు కలిసి పలు కార్యక్రమాలను చేపట్టనున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ విశ్వనాథ్‌కుమార్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఫైన్ ఆర్ట్స్. సంస్కృతిని పరిరక్షించడం, ప్రోత్సహించడం అనివార్యమన్నారు. ఈ ఒప్పందం రాబోయే తరం కళాకారులు, విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడనుంది. రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి అంగవైకల్యం అడ్డు రాకూడదు

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్
- డిప్యూటీ సీఎం చొరవతోనే దివ్యాంగులకు స్కూటర్ల పంపిణీ : కలెక్టర్ చామకూరి శ్రీధర్


దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్ల పంపిణీలో కలెక్టర్ శ్రీధర్, తదితరులు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి అంగవైకల్యం అడ్డు రాకూడదని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లాకు చెందిన ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, వర్చువల్‌గా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా ఉచిత స్కూటర్లను పంపిణీ చేశారు. దివ్యాంగులైన లక్కిరెడ్డిపల్లె మండలం కాపుపల్లి గ్రామానికి చెందిన కట్ట ఆదినారాయణ, వేములవాండ్లపల్లెకు కాల్వ చంద్రశేఖర్‌లకు రెండు లక్షల రూపాయలతో కొన్న 2 రెట్రోఫిటెడ్ మోటార్ స్కూటర్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంతో చొరవ చూపి తన సొంత బడ్జెట్ నుంచి రెండు లక్షలు కేటాయించి వాహనాలను కొని లబ్ధిదారులకు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఇది వారికి చాలా చిన్న ఉపశమనమే అయినప్పటికీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి తన పెద్ద మనసును చాటుకోవడం ద్వారానే ఇంత మంచి కార్యక్రమాన్ని చేయగలిగామని తెలిపారు. శనివారం రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆదినారాయణ, చంద్రశేఖర్‌లు ఉపముఖ్యమంత్రిని కలిసిన సందర్భంగా ఆయన ఆదేశాల మేరకు రెండు స్కూటర్లను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, విభిన్న ప్రతిభావంతులశాఖల జిల్లా అధికారి కృష్ణకిశోర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా బ్రహ్మోత్సవాల పనులు

- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు పనులు వేగవంతం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అన్నారు. సోమవారం దేవునికడప బ్రహ్మోత్సవాల్లో భాగంగా కడపకు వెళుతూ కోదండరామాలయం చేరుకుని రాబోయే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. బ్రహ్మోత్సవాలకు మరో మూడు నెలలకు మాత్రమే సమయం ఉండడంతో భక్తులకు అవసరమయ్యే పనులను వేగవంతం చేయాలని వీటితో పాటు రామాలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఆయన సమీక్షించారు. రామాలయం వద్ద గ్రీనరీని పెంచాలని, వాటి కోసం ప్రత్యేక ప్లాంటేషన్‌ను చేపట్టాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. రామాలయం చుట్టూ ఉన్న పార్కులను సుందరీకరణ చేపట్టాలని తెలిపారు. వీటితో పాటు భక్తులకు సేద తీరేందుకు పార్కుల్లో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కల్యాణవేదిక వద్ద పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల్యాణోత్సవానికి హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక ప్రణాళికలతో పనులు చేపట్టాలని సూచించారు. ప్రసాదాలు పంపిణీ, తలంబ్రాల పంపిణీ వంటివాటిపై ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేసి అందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ సుమతి, డీఈ వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో శ్రీనివాసులు, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసులు, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల పనులపై అధికారులతో చర్చిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

శాంతిభద్రతలను పరిరక్షించాం

- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాం
- కోటి 87 లక్షల విలువ చేసే 1252 మొబైల్ ఫోన్‌ల రికవరీ
- 8878 సీసీ కెమెరాలతో జిల్లాను నిఘా నేత్రంగా తీర్చిదిద్దాం
- మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేసిందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను పటిష్టపరిచి ప్రజల సహకారంతో శాంతిభద్రతలను పరిరక్షించామని తెలిపారు. మహిళా పోలీసులతో తరచూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ మహిళలు, బాలికల్లో చట్టపరంగా చైతన్యపర్చడమే కాకుండా ప్రజలు సైబర్ క్రైం బారిన పడకుండా అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించామన్నారు. ఈ ఏడాదిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఆరుగురిని జిల్లా బహిష్కరణ చేశామన్నారు. సైబర్ క్రైం ద్వారా నష్టపోయిన బాధితులకు రూ.2 కోట్ల 47 లక్షల 57 వేల 540 రికవరీ చేసి అప్పగించామని చెప్పారు. జిల్లాలో నేరాల కట్టడి కోసం జిల్లా వ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో 8878 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక కృషి

జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను పటిష్టపరిచి శాంతిభద్రతలను పకడ్బందీగా అమలు చేయడమే కాకుండా విజిబుల్, ప్రివెంటివ్ పోలీసింగ్‌తో శాంతిభద్రతల పరంగా సున్నితమైన అంశాలను ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి సామరస్యంగా పరిష్కరించామన్నారు. 2024లో రూ.5 కోట్ల 19 లక్షల 68 వేల 696లు ప్రాపర్టీ లాస్ జరగగా అందులో నుంచి రూ.2 కోట్ల 12 లక్షల 36 వేల 772లు రికవరీ చేశామన్నారు. హత్యలు, అత్యాచారాలు, హత్యాప్రయత్నాలు, దొంగతనాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో కేసులు, ఛీటింగ్ కేసులు, సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు తదితర భూసమస్యల కేసులు 2023 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 4289 కేసు నమోదు దాకా 2024లో 3616 కేసులు నమోదయ్యాయన్నారు. 2024లో రోడ్డు ప్రమాదాలు 643 జరగగా అందులో 349 మంది మృతి చెందగా 814 మంది గాయపడ్డారన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కింద 1470 కేసు నమోదు కాగా 43,606 మందికి రూ.కోటి 13 లక్షల 5 వేల 045లో జరిమానా విధించామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు 7 కేసులు నమోదు చేసి 54 మంది నిందితులను గుర్తించడంతో పాటు అందులో 25 మంది ఎర్రచందనం స్మగ్లర్లు, కూలీలు, మేస్త్రీలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.56 లక్షల 63 వేల 246 విలువ గల 2,451 కేజీల బరువు గల 83 ఎర్రచందనం దుంగలతో పాటు 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

చోరీ కేసుల్లో...

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 800 గ్రాముల బంగారు నగలతో పాటు 17 కేజీల వెండి, 86 లక్షల నగదు రికవరీ చేశామన్నారు. అలాగే సుండపల్లె, మదనపల్లె, ముదివేడు ప్రాంతాల్లో మహిళలను చంపిన, అత్యాచారం కేసుల్లో నలుగురికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన మొబైల్ ఫోన్ మిస్సింగ్ కేసుల్లో రూ.ఒక కోటి 87 లక్షల 80 వేల విలువ గల 1252 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా జూదం ఆడుతున్న 2537 మందిపై 418 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 63 లక్షల 47 వేల 664 నగదును 43 సెల్‌ఫోన్లను, 100 వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కోడిపందెం ఆడుతున్న 560 మందిని అరెస్టు చేసి 89 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 9,74,900 నగదును, 16 సెల్‌ఫోన్లు, 257 కోడిపుంజులు, 77 కోడికత్తులు, 109 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే మట్కా ఆడుతున్న 15 మందిని అరెస్టు చేసి 6 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.53,230లు నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అంతేగాక ఆయుధాల నిరోధక చట్టం కింద 19 మందిని అరెస్టు చేసి వారిపై 13 కేసులు నమోదు చేసి అక్రమంగా కలిగి ఉన్న 15 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పేలుడు పదార్థాల నిరోధక చట్టం కింద 9 మందిని అరెస్టు చేసి రెండు కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 13 బాంబులు, జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బియ్యం అక్రమ రవాణా కింద 40 మందిని అరెస్టు చేసి 24 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 2,06,572 కిలోల బరువు గల 4578 బియ్యం బస్తాలు 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నాటుసారా తయారీ విక్రయాల కింద 114 కేసులు నమోదు చేసి 1168 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 5055 లీటర్ల నాటుసారాతో పాటు 5834 లీటర్ల అక్రమ మద్యం, 13,475 లీటర్ల నాటుసారా ఊటను నాశనం చేయడంతో పాటు 53 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అలాగే మాదకద్రవ్యాల నిర్మూలన చట్టం కింద 126 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 258 కేజీల గంజాయితో పాటు 6 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అంతేగాక ఇసుక అక్రమ రవాణా విషయంలో 214 మందిపై 136 కేసులు నమోదు చేసి 143 ట్రాక్టర్లు, 17 లారీలు, 7 జేసీబీలు సీజ్ చేసి వెయ్యి టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే గల్ఫ్‌దేశాల్లో ఇబ్బందులు పడుతున్న జిల్లా వాసులను స్వదేశానికి తీసుకురావడానికి కృషి చేశామన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులతో పాటు సిబ్బంది సమిష్టిగా కృషి చేసి 2023 కన్నా 2024 సంవత్సరంలో నేరాలను అదుపు చేయడంలో కీలకపాత్ర పోషించే 15 శాతం తగ్గించేందుకు కృషి చేశామని, రాబోయే 2025 సంవత్సరంలో కూడా ఇదే అంకితభావంతో పనిచేసే నేరాలను కట్టడి చేస్తామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రితో పాటు రాయచోటి, రాజంపేట, మదనపల్లె డీఎస్పీలు కృష్ణమోహన్, సుధాకర్, కొండయ్యనాయుడు పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, చిత్రంలో పోలీసు అధికారులు

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు

పులివెందులటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. పట్టణ పరిధిలోని సమతానగర్, భాకరాపురం వీధిలో నివాసం ఉంటున్న మాలేపాటి పల్లవి (26)కు 8 ఏళ్ల కిందట సునీల్ కుమార్‌రెడ్డితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా భర్త హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ సంవత్సరం క్రితం కంపెనీ మూసివేసినందున ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తన పిల్లలను స్కూలు వద్ద వదిలిపెట్టి ఇంటికి తిరిగి వచ్చేసరికి బెడ్‌రూముకు లాక్ చేసుకొని ఉంది. భర్త, బంధువులు ఎంత పిలిచినా పలకకపోవడంతో డోరు పగులగొట్టి చూడగా ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు బంధువులు పులివెందుల అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


ఆత్మహత్యకు పాల్పడ్డ పల్లవి

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీని సద్వినియోగం చేసుకోండి

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి


ప్రథమ విజేతకు బహుమతిని అందిస్తున్న గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ ద్వారా మీ వస్తువులను నేరుగా మీ ఇళ్ల వద్దకే చేరవేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి సూచించారు. ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను పురస్కరించుకుని (ఈ నెల 20 నుంచి వచ్చే జనవరి 19 వరకు) డోర్ డెలివరీలను ప్రోత్సహించడంలో భాగంగా డోర్ డెలివరీ బుక్ చేయు వినియోగదారులకు ప్రోత్సాహక బహుమతులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి ఈనెల 30, జనవరి 6, 13, 19 తేదీలలో ఇవ్వనున్నారు. అందులో భాగంగా మొదటి విడతగా సోమవారం స్థానిక కడప కార్గో కార్యాలయ ఆవరణంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో మొదటి విజేతగా కిరణ్‌కుమార్ (కడప), ద్వితీయ విజేతగా (కడప) తృతీయ విజేతగా ఎంపీఎల్ ఏజెన్సీ (కడప) నిలిచారు. విజేతలకు ఆర్ఎం చేతులమీదుగా బహుమతి ప్రదానం గావించారు. కార్యక్రమంలో కార్గో ఏటీఎం కమర్షియల్ జనార్థన్, కడప డిపో మేనేజర్ డిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను తక్కువ చేస్తే సహించేది లేదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

కడప సెవెన్‌రోడ్స్ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడితే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య హెచ్చరించారు. పార్లమెంటులో అమిత్‌షా అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు, లౌకిక ప్రజాస్వామిక సంస్థల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా కడప నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ భారతదేశం భిన్న సంస్కృతుల కలయికతో ఉందని, అనేక భాషలు, సంస్కృతులు, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఉన్నాయ, అటువంటి వైవిధ్యం కలిగిన దేశానికి ఒక రాజ్యాంగం రచించి అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. అటువంటి అంబేడ్కర్‌ను అమిత్‌షా తక్కువ చేసి మాట్లాడడం ప్రజలు క్షమించరన్నారు. అమిత్‌షాను మంత్రి మండలి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ హిందుత్వం ముసుగులో దేశ సంపదను ప్రభుత్వ రంగ సంస్థలు ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అదానీ, అంబానీలకు ఇతర కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. బీజేపీ హిందువుల ప్రయోజనాలు కాపాడలేదని, హిందుత్వం ముసుగులో వ్యాపారం చేస్తోందని అటువంటి బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. అమిత్‌షాను మంత్రి మండలి నుంచి తొలగించని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కమలాపురంరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని రైల్వేగేటు వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని స్వాతి (25) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మృతురాలు చెవిలో బ్లూటూత్ పెట్టుకొని ఫోన్ మాట్లాడుతూ వచ్చే రైలును గమనించకుండా ట్రాక్ దాటే ప్రయత్నం చేసిందని, ఈ క్రమంలో రైలు ఢీకొనిందని తెలిపారు. కాగా ఈమె కొప్పర్తి పారిశ్రామికవాడలో సీసీ కెమెరాల విభాగంలో పనిచేస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


రైలు ప్రమాదంలో మృతి చెందిన స్వాతి

పనులు వేగవంతం చేయాలి

● సీజీఎం అయూబ్‌ఖాన్


మాట్లాడుతున్న చీఫ్ జనరల్ మేనేజర్ అయూబ్‌ఖాన్

కడప నాగరాజుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద జరిగే పనులు వేగవంతం చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ అయూబ్‌ఖాన్ కాంట్రాక్టర్లకు సూచించారు. కడపలోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో జిల్లాలోని కాంట్రాక్టర్లతో ఎస్ఈ ఎస్.రమణ సమీక్ష సమావేశం నిర్వహించారు. చీఫ్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ పనుల నాణ్యతలో రాజీపడకుండా పనులు వేగవంతం చేసి గ్రామీణ ప్రాంత అభివృద్ధిలో తమవంతుగా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి దేశాభివృద్ధికి చిహ్నాలని గుర్తుచేశారు. ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా పల్లెలను పట్టణాలతో ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాల కల్పనలో అత్యంత ప్రధానమైన త్రిఫేజ్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. పల్లెలోని సింగిల్ ఫేజ్ కేబుల్ లైన్ల స్థానంలో త్రిఫేజ్ 5 వైర్ల ఎల్టీ లైన్‌ను కండక్టర్ ద్వారా ఏర్పాటు చేసి, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో త్రిఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి పల్లెల్లో ఉండే విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలియజేశారు. ఈ ప్రక్రియ ఎంత త్వరగా పూర్తయితే అంత త్వరగా గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేయవచ్చని తెలిపారు. తద్వారా పట్టణాలకు దీటుగా పరిశ్రమల ఏర్పాటుకు సులభతరం అవుతుందని తెలిపారు. కొంతమంది కాంట్రాక్టర్లు కొత్త లైన్లు వేసేందుకు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయని, పొలం గట్ల వెంబడి తీసుకెళ్లాలని సూచించారు. ఈ మహత్తర కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి, ప్రత్యేకంగా గృహాలకు విద్యుత్ వ్యవస్థ వేర్వేరుగా ఏర్పడుతుంది. తద్వారా 24 గంటల త్రిఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. ప్రజలు కూడా గ్రామీణ ప్రాంత అభివృద్ధికి తమవంతుగా కొత్తలైన్లు వేయుటకు ఆటంకాలు కలిగించకుండా తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ ఈఈలు నాగరాజు, శ్రీనివాసులు, డీఈఈలు, ఏఈఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళ ఆత్మహత్యాయత్నం

● సంఘ సభ్యుల వేధింపులు, పేరును తొలగించారని మనస్థాపం


ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవి

రైల్వేకోడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘానికి చెందిన 2వ లీడర్ పేరును సంఘం నుంచి తొలగించారని బాధితురాలు సోమవారం వెలుగు కార్యాలయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ పరిధిలో ఉన్న దళితవాడకు చెందిన బైరాగిల దేవి అనే డ్వాక్రా మహిళ లక్ష్మి నరసింహ డ్వాక్రా గ్రూపులో 2వ లీడర్‌గా ఉంది. ఆమె ఆలస్యంగా డబ్బులు చెల్లిస్తోందని, తీసుకున్న రుణం సక్రమంగా ప్రతి నెలా చెల్లించడం లేదని ఆమెను గ్రూపు నుంచి తొలగించాలని సుమారు నాలుగు నెలల నుంచి సంఘంలోని కొందరు ప్రయత్నిస్తున్నారని బాధితురాలు తెలిపింది. తాను రూ.34,900 బాకీ ఉండగా దానిని బయట వడ్డీకి డబ్బు తెచ్చి చెల్లించానని, తాను తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లిస్తున్నానని తెలిపింది. కొత్తవారిని ఇద్దరిని సంఘంలోకి తీసుకోవాలని సంఘం సభ్యులు చూస్తున్నారని, తాను 30 ఏళ్లుగా సంఘంలో ఉంటున్నానని చెప్పినా సంఘం సభ్యులు పట్టించుకోవడం లేదని, తొలగింపు వ్యవహారం అధికారులకు తెలియకుండా యానిమేటర్ చేస్తున్నారని బాధితురాలు తెలిపింది. తాను వితంతువునని, తనకు ఒక బుద్ధిమాంద్యం గల కుమార్తె ఉందని కూలీనాలీ చేసుకుని జీవిస్తున్నానని, భర్త లేకపోయినా అల్లుడు నాగరాజు సాయంతో జీవనం గడుపుతున్నామని బాధితురాలు తెలిపింది. సంఘంలో తన పేరు తొలగిస్తున్నారని, తనకు రుణం ఇవ్వమని చెప్పినందుకు తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపింది. వెలుగు కార్యాలయంలో పురుగుల మందు తాగిన మహిళ అపస్మార స్థితికి చేరుకోవడంతో రైల్వేకోడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది.

మొత్తం డబ్బులు చెల్లించింది

డ్వాక్రా మహిళ దేవి తాను తీసుకున్న రుణానికి సంబంధించిన డబ్బులు చెల్లించిందని, ఆమెను సంఘంలో ఉంచుకోవాలని సంఘ సభ్యులకు చెప్పినట్లు రైల్వేకోడూరు వెలుగు ఏపీఎం వసుంధర తెలిపారు. గ్రామంలో జరిగిన విషయాలు తనకు తెలియదని, దీనిపై సమగ్రంగా విచారణ చేస్తామని వివరించారు.

ఎస్‌హెచ్‌జీ ద్వారా ఉత్పత్తుల ప్రదర్శన


ఉత్పత్తులను పరిశీలిస్తున్న మెప్మా పీడీ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమాన్ని సోమవారం కడప నగరంలో మెప్మా పీడీ వై.సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ మార్కెట్ ద్వారా పట్టణ పరిధిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే క్రమంలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రదర్శనల ద్వారా వినియోగదారులకు స్థానిక ఉత్పత్తులను అందించడంతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధులు కల్పించబడతాయన్నారు. అదేవిధంగా వివిధ రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఒక యాప్‌ను రూపొందించి అందులో తమకు అవసరమైన సేవలను ఇంట్లో నుంచే బుక్ చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, వాషింగ్ మిషన్, ఏసీ, గ్రీజర్, వాటర్ ఫిల్టర్ లాంటి పరికరాల మరమ్మత్తులతో పాటు బ్యూటీషియన్, మెన్ సెలూన్ లాంటి సేవలను ఈ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. ఈ సేవలకు చార్జీలను ముందుగానే నిర్ణయిస్తామని తెలిపారు. దీని ద్వారా వినియోగదారులు అధిక మొత్తంలో ఖర్చుచేసే పరిస్థితి తప్పుతుందన్నారు. అదేవిధంగా వివిధ రంగాల పనులు చేసే వారికి ఉపాధి అవకాశాలు కల్పించే పరిస్థితి కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్ నాగరాజు, సీఎంఎం రాజేశ్వరి, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని చేనేత కార్మికుడు మృతి

కురబలకోట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో చేనేత కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం రాత్రి మండలంలో జరిగింది. వివరాలిలా... కురబలకోట రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురైంది. ఆ బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో ఎక్కిస్తుండగా ద్విచక్రవాహనదారుడు బస్సును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మదనపల్లె పట్టణం చంద్రాకాలనీ కనకదాస్‌నగర్‌కు చెందిన శివ(26) చేనేత కార్మికుడిగా మగ్గం పనిచేస్తున్నాడు. కాగా ఇతను తన ద్విచక్రవాహనంలో ఒక మహిళతో కలిసి గుర్రంకొండ రోడ్డు వైపున ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మార్గమధ్యంలోని కురబలకోట ఫ్లైఓవర్ సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళను చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతిచెందిన యువకుడిని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేశారు.

ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ

మహమ్మద్ రఫీపై దాడి

● ఆరుగురిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ మహ్మద్‌రఫీపై కొందరు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి రూరల్ పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈ దాడి ఘటనకు సంబంధించి టూటౌన్ పోలీసుస్టేషన్ ఎస్ఐ ధనుంజయ.. లింగమయ్య మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..

ఆదివారం రాత్రి 7 గంటలకు జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని చిన్నశెట్టిపల్లె క్రాస్ వద్ద బైకు-కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న రాజుపాళెంకు చెందిన లింగమయ్య, ప్రొద్దుటూరుకు చెందిన హర్ష అనే ఇద్దరు యువకులు కిందపడి గాయపడ్డారు. ప్రమాద ఘటనపై రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీకి సమాచారం రాగా యువకులను ఇద్దరిని ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం కడప కొండాయపల్లి చిన్నచౌక్‌కు చెందిన కారు డ్రైవరు కడలయ్యగారి వెంకటరెడ్డి (24)ని పోలీసు స్టేషన్లో విచారించి 35 (3) బీఎన్ఎస్ఎస్ కింద నోటీసులు ఇచ్చి పంపారు. ఇదిలా వుండగా ప్రమాదంలో గాయపడిన లింగమయ్యకు సంబంధించి రాజుపాళెంకు చెందిన వ్యక్తులు సంఘటన విషయం తెలుసుకొని రూరల్ పోలీసు స్టేషనుకు వచ్చి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవరును ఎందుకు వదిలేశారని డ్యూటీలో వున్న కానిస్టేబుల్స్ రమేష్, చిన్ననాగన్న, ఏఎస్ఐ జాఫర్ హుస్సేన్‌పై గట్టిగా అరుపులు అరిచి కేకలు వేశారు. ఈ విషయం రూరల్ ఎస్ఐ రఫీకి ఫోన్‌లో డ్యూటీలో వున్న పోలీసులు సమాచారం అందించగా ఆయన మఫ్టీలో స్టేషనుకు వచ్చారు. కాగా ఎస్ఐ రఫీతో కూడా లింగమయ్య సోదరుడు పెద్ద లింగమయ్య మరికొందరు వాగ్వాదానికి దిగారు. చట్టప్రకారం కారు డ్రైవరును నోటీసులు ఇచ్చి పంపామన్నా కూడా వినకుండా 'ఏందిరా నీతో మాట్లాడేది' అని ఎస్ఐ ఎడమ చెంపపై చేతితో కొట్టారు. దీంతో ఎస్ఐపై దాడి చేయడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించినందుకు లింగమయ్య, శివ, రాము, ప్రవీణ్, మేరీశాంతి మరి కొందరిపై టూటౌన్ పోలీసు స్టేషన్లో 364/24 అండర్ సెక్షన్ 121 (1) 132 రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్ చట్టం ప్రకారం ఎస్ఐ ధనుంజయ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో గొల్లపల్లె

నిమ్మనపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతి మారు మూల గ్రామమైన గొల్లపల్లె ప్రభుత్వాలు మారినా అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటోంది. గ్రామంలో దాదాపు 200 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. ఇదే గ్రామంలో 1983లో టీడీపీ వ్యవస్థాపకుడు అప్పటి ముఖ్యమంత్రి నందమూరిరామారావు కాలనీని ఏర్పాటు చేసి 70 ఇళ్లను మంజూరు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాలనీకి రోడ్లుగాని కాలువలు గాని నిర్మించలేదు. అంతే కాకుండా కనీ సం విద్యుత్ సౌకర్యం కల్పించక పోవడంతో సొంత ఖర్చులతో కొన్ని పోల్స్‌ను ఏర్పాటు చేసుకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామంలో చాలా ఇళ్లకు కరెంటు సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. కాగా ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు వచ్చి లేని పోని వాగ్దానాలు ఇచ్చి వారి పబ్బం గడుపుకొని మరళా తిరిగి చూడడంలేదంటున్నారు. కాగా గ్రామంలో సరైన రోడ్లులేక ప్రజలు అన్ని విధాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉందంటున్నారు. అయితే ఎన్ని ప్రభుత్వాలు మారినా మా గ్రామంపై చిన్న చూపు చూపుతున్నా రన్నారు. కూటమి ప్రభుత్వమైనా కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


గొల్లపల్లెలోని రహదారి దుస్థితి

రోడ్లు లేక నరకయాతన అనుభవిస్తున్నాం



దాదాపు 30ఏళ్లుగా రోడ్లు, కాలువలు, కరెంటు లేక నరకయాతన అనుభవిస్తున్నాం. ఎన్ని అర్జీలు, వినతులు సమర్పించినా పట్టించుకొనే నాథుడే కరువ య్యారు. కనీసం టీడీపీ ప్రభుత్వంలోనైనా మా కష్టాలు తీరుతాయని కోరుకుంటున్నాం.

-ఎస్.గోపాల్ గ్రామస్థుడు గొల్లపల్లె

అంధకారంలోనే జీవనం సాగిస్తున్నాం



గ్రామంలో విద్యుత్ సౌకర్యం సరిగాలేక అంధకా రంలోనే జీవనాన్ని నెట్టుకొటస్తున్నాం. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోడ్లు వేయకపోవడంతో వర్షం వచ్చినపుడు రోడ్లపై నీరు నిలిచి సమస్యలు తప్పడంలేదు.

-డి.గోపమ్మ గ్రామస్థురాలు గొల్లపల్లె

నూతన సంవత్సరానికి హార్సిలీహిల్స్‌కు 26 బస్సులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):మదనపల్లె ఆర్టీసీ డిపో నుంచి నూతన సంవత్సరం జనవరి ఒకటో తేదీ కోసం హార్సిలీహిల్స్‌కు 26 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరేవెంకటరమణారెడ్డి తెలిపారు. ఇందులో మదనపల్లె నుంచి హార్సిలీహిల్‌కు 12, బి.కొత్తకోట నుంచి హార్సిలీహిల్స్‌కు 4 బస్సులు కాండ్లమండుగు క్రాస్ నుంచి హార్సిలీహిల్స్‌కు 10 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ఆరు బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు.

జాతీయ చాంపియన్ షిప్‌కు మదనపల్లె విద్యార్థులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జరిగే జాతీయ డ్యాన్స్ స్పోర్ట్సు చాంపియన్ షిప్‌కు మదనపల్లె విద్యార్థులు ఎంపికయ్యారు. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన సూర్యడ్యాన్స్ అకాడమీ విద్యార్థులు లిపికశ్రీ, జష్మితశ్రీ, నందిని కదిరిలో జరిగిన స్టేట్ లెవల్ డ్యాన్స్ పోటీల్లో గెలుపొంది జనవరి 15న పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జరిగే జాతీయ డ్యాన్స్ స్పోర్ట్సు ఛాంపియన్ షిప్‌కు ఎంపికయ్యారని అకాడమీ నిర్వహకులు తెలిపారు. సోమవారం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చిన్నారులను అభినందించారు. చదువుతోపాటు ఆటల పోటీల్లో చిన్నారులు రాణించాలన్నారు.

కొడవలితో దాడి కేసులో నిందితులు అరెస్ట్

తంబళ్లపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లెలో అదే గ్రామానికి చెందిన గంగిరెడ్డి(70)పై ఆదివారం కొడవళితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. అరెస్టు అయిన నిందితులు హసీనా(38), మున్నా(38), షాహీద్(23), ముబారక్(24),దౌలత్‌బి(73),నాగూర్(42)లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచారు. జడ్జి నిందితులకు 14 రోజుల పాటు రిమాండు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా జయరామిరెడ్డి



ములకలచెరువు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా పీవీ జయరామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని వేపూరికోటలో సోమవారం మండల బీజేపీ కమిటీ ఎన్నిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల రిటర్నింగ్ అధికారి మురళీ మహన్, ముఖ్య అతిథులుగా రాష్ట్ర కో ఆపరేటీవ్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మంగరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేపూరికోటకు చెందిన జయరామిరెడ్డిని రెండవ సారి ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. జయరామిరెడ్డిని నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, ద్వారకా, నగేష్, మనోహర్, వెంకటేష్, శవకుమార్, భాస్కర్‌రెడ్డి, శంకర పాల్గొన్నారు.

చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ఫణికుమార్

కలకడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):ఎస్సీ, ఎస్టీ ప్రజలను ఎవరైన అసమానతలకు గురి చేస్తే అలాంటి వారిపై చటరీత్యా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఫణి కుమార్, ఎంపీడీవో అబ్దుల్ రహీంలు పేర్కొన్నారు. సోమవారం ఎనుగొండపాలెం పంచాయతీ బండమీదపల్లె ఎస్టీ కాలనీలో సివిల్ రైట్స్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ కాలనీ వాసులకు శ్మశాన వాటిక స్థలాన్ని కల్పించి మౌలిక వసతులను కల్పించాలని కోరారు. అలాగే అర్హులకు వడ్డీలేని రుణాలను మంజూరు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, రామకృష్ణ, అధికారులు రూప్‌సాగర్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

వ్యవసాయ పొలాల వద్ద ఆరు స్టార్టర్లు చోరీ

నిమ్మనపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతి యర్రప్పగారిపల్లి వ్యవసాయ పొలాల వద్ద ఉన్న బోరు మోటార్‌కు బిగించిన ఆరు స్టార్టర్లు రోజుకు ఒక్కటి చొప్పున చోరీ గురి కావడంతో సోమవారం గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు పది రోజులుగా గ్రామంలోని సహదేవ, వెంకటరమణ, సిద్దయ్య, వెంకటక్రిష్ణ, చంద్ర, శ్రీనివాసులకు చెందిన దాదాపు 6 స్టార్టర్లు చోరీకి గురయ్యాని దీంతో తాము వేసిన పంటలు ఎండు ముఖం పట్టాయని తెలిపారు. చోరీకి గురైన కొన్ని స్టార్టర్‌లు అదే గ్రామంలో ఓఇంటి మరుగుదొడ్డిలో పడవేసి తాళం వేసినట్లు తెలియడంతో పోలీసులు గ్రామంలోకి వచ్చి విచారణ చేపట్టారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు సాంకేతికతకు తోడ్పాటు


సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవోలు, ఎస్ఎంసీ ఛైర్మన్

తంబళ్లపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలో సాంకేతిక ప్రగతి సాధ్యమవుతుందని ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ మేళాను ఎంఈవోలు, ఎస్ఎంసీ ఛైర్మన్ శివకుమార్ ప్రారంభించారు. ఈ మేళాలో మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొని రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వారిలో వ్యక్తిగత కేటగిరిలో మహాత్మా జ్యోతిరావు పూలేబీసీ పాఠశాల విద్యార్థి శేషాద్రి ప్రదర్శించిన థర్డ్ ఐ బ్లైండ్ ప్రాజెక్టు, గ్రూప్ కేటగిరిలో కన్నెమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థి వర్షిత, దీపిక ప్రదర్శించిన వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపిక అయినట్లు ఎంఈవో తెలిపారు. సైన్స్ మేళాలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మణి, హెచ్ఎం శ్రీనివాసులు, గైడ్ టీచర్లు నాగలక్ష్మి, పీఎస్ఎల్ఎన్ శాస్త్రి, సీఆర్పీలు విద్యార్థులు పాల్గొన్నారు.



ములకలచెరువులో: మండలంలోని బురకాయలకోట జడ్పీ హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు పలు నమూనాలు ప్రదర్శించారు. ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన బురకాయలకోట గురుకుల పాఠశాల విద్యార్థి శైలజ, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు అఫ్రా, ప్రనీతరెడ్డి, గీతాంజలికు ఎంఈవోలు వెంకటరమణ, శంకరయ్యలు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రెడ్డిరాధా, మల్లేశ్వరి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో: విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈవో ద్వారకనాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్ళు జడ్పీహైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేట్టిన నమూన ప్రయోగాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

రామసముద్రంలో: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంఈవో ఆంజనేయులు, హెచ్ఎం బిట్టిబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతతూ విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకుని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు.

న్యూఇయర్‌లో రోడ్లపై సంబరాలు నిషేధం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): న్యూఇయర్ సందర్భంగా మంగళవారం(ఈనెల31)రాత్రి రోడ్లపై సంబరాలు నిషేదమని మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూనూతన సంవత్సర వేడుకల్లో రోడ్లపై కేకులు కోయడం, మద్యం తాగడం, యువకులు అతివేగంగా సైలెన్సార్ తొలగించి బైకులు నడపడం, బాణాసంచా కాల్చడం, బైకులు రైడింగ్ నిర్వహించడం పూర్తిగా నిషేధం అన్నారు. నిబంధనలను అతిక్రమించితే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేసి అరెస్టు చేయాల్సి వస్తుందని డీఎస్పీ హెచ్చరించారు.

బి.కొత్తకోటలో: న్యూ ఇయర్ వేడుకలను ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించి జరుపుకోవాలని బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగానాథ్‌బాబు హెచ్చరించారు. సోమవారం బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ డిసెంబరు31 రాత్రి మండలంలోని అన్ని హోటళ్లు, డాబాలు, రెస్టారెంట్లు రాత్రి 10గంటల తర్వాత తెరిచి ఉంచడానికి అనుమతి లేదన్నారు. వైన్‌షాపులు, రెస్టారెంట్లు నిర్దేశించిన సమయం వరకు మాత్రమే ఉండాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను అందరూ ప్రశాంత వాతావరణం లో కుటుంబాలతో కలసి చేసుకోవాలని సీఐ సూచించారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):కర్ణాటక రాష్ట్రంలోని రాయల్పాడు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మదనపల్లె మండలం, చీకలబైలు గ్రామం, బార్లపల్లెకు చెందిన వసంత్‌కుమార్(30)యువకుడు మృతిచెందాడు. సోమవారం రాయల్పాడు- మదనపల్లె రోడ్డు హకిబికి కాలనీ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వసంత్‌కుమార్ కారును ఢీ కొని అక్కడిఅక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి రాయల్పాడు పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదదేహాన్ని శ్రీనివాసపురం ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై చొరవచూపాలి

కలకడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):దీర్ఘకాలంగా పరిష్కారం కానీ ఉపాధ్యాయుల సమస్యలపై చొరవచూపాలని ఎస్టీయూ నాయకులు శివారెడ్డి, మధుసూదన్‌లు కూటమి ప్రభుత్వాని కోరారు. సోమవారం మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు. అలాగే సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సదాశివారెడ్డి, వైవిరమణ, సుబ్రమణ్యం, శ్రీనివాసారావు, వెంకటేశ్వరరావు, జివిరమణ, ఖాజాబీ, నరేంద్రలు పాల్గొన్నారు.

లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం

వాల్మీకిపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ది అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా లింగోద్భవ మహాశివుడికి వైభవంగా అన్నాభిషేకం నిర్వహించారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అమావాస్య పూజలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

పదవీ విరమణ చేసిన ఫార్మాశిస్టు కు సన్మానం

బి.కొత్తకోట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో గ్రేడ్1 ఫార్మాశిస్టుగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన శివమ్మ ను ఆసుపత్రి సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. మెడికల్ ఆఫీసర్ కిరణ్, వైద్యులు ఆరిఫ్, హసీనా తదితరులు విధి నిర్వహణలో శివమ్మ పనితీరును ప్రశం సించారు. దుశ్శాలువలు, పూలమాలలతో సన్మానిస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు.

ఎంపీడీవోపై దాడి దారుణచర్య

తంబళ్లపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై వైసీపీ నేత దాడి చేయడం దారుణమైన చర్య అని పెద్దేరు ప్రాజెక్టు ఛైర్మన్ కొటాల శివకుమార్, చెరువు సంఘం ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం టీడీపీ నాయకులు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డిని కలసి సంఘీబావం తెలిపారు.ఈ ఘటనలను కూటమి ప్రభుత్వం సహించదన్నారు.

ఇక నుంచి కేవీకే క్షేత్రాల్లో వరి పంటలు

● మౌలిక సదుపాయాల కోసం రూ.30 లక్షలు మంజూరు


రైతులకు ఉచితంగా డ్రమ్ములు అందజేస్తున్న కేవీకే అధికారులు

కలికిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో ఇక నుంచి వరి పంటలు సాగు చేయనున్నట్లు కోఆర్డినేటర్ మంజుల తెలిపారు. కేవీకే స్థాపించినప్పటి నుంచి నీటి కొరత కారణంగా మెట్ట పంటలకే పరిమితమయ్యామని తాజాగా భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ ద్వారా కేవీకేలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 30 లక్షలు మంజూరు చేయడంతో ఆదివారం వ్యవసాయ క్షేత్రంలో బోరు తవ్వించామన్నారు. కావలసిన నీరు లభ్యం కావడంతో ఇక నుంచి కొత్త వంగడాలతో వరి పంటలను కూడా సాగు చేయనున్నామని పేర్కొన్నారు. మంజూరైన నిధులలో బోర్‌వెల్‌తోపాటు క్రాస్ డ్రైనేజ్ పనులు, అంతరంగ రహదార్లు, వాటర్ సంప్ పనులు చేపట్టినట్లు ఆమె వివరించారు. వేరుశనగ, కంది, అపరాలు, ఆముదము వంటి మెట్ట పంటలు, పరిమితంగా కూరగాయ పంటలను గతంలో సాగు చేసే అవకాశముండేదని ఇక నుంచి కొత్త వరి వంగడాలను రైతులకు పరిచయం చేయడం కోసం వరి, పశుగ్రాసం సాగును కూడా చేపట్టే అవకాశం లభించిందని తెలిపారు. కాగా సోమవారం కేవీకేలో పశువులు, కోళ్ళ పెంపకంపై రైతులకు శిక్షణ కార్యక్రమం పశువైద్య శాస్త్రవేత్త కె.నవీన ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రైతులకు గ్రామప్రియ కోడి పిల్లలు, టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములను ఉచితంగా అందజేశారు.

కేంద్ర హోం మంత్రిని పదవి నుంచి తొలగించాలి


ధర్నా చేస్తున్న సీపీఐ, బాస్ నాయకులు

ములకలచెరువు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమీత్‌షాను పదవి నుంచి తక్షణం తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, బాస్ సీనీయర్ నాయకుడు మంత్రాల రమణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన అమీత్‌షాను తొలగించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటరమణనాయుడు, మల్లికార్జున. నాయకులు రమేష్ బాబు, రవి, సుబ్బన్న, కదిరప్ప, రామచంద్ర, పెద్దన్న, ధంకరమ్మ, నాగరాణి, నజీమా, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో కేంద్రం మంత్రివర్గ నుంచి హోం మంత్రి అమీత్‌షాను బర్తరఫ్ చేచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలని కోరుతూ సోమవారం దేశ వ్యాప్తంగా వామపక్షాలు నిర్వహిస్తున్న నిరసనలో భాగంగా మదనపల్లెలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వామపక్షనాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, నరసింహా, నాగరాజ, రాజబాబు, రమణ, లతీఫ్, సీపీఐ నాయకులు నరసంహా, రెడ్డి, తిరుమల, దేవా, ఆటో యూనియన్ నాయకులు అంజాద్, ప్రసాద్, గంగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

పెద్దబండ దారి సమస్యను వెంటనే పరిష్కరించండి


దారి సమస్యపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న అయ్యవారిపల్లె గ్రామస్థులు

వాల్మీకిపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):వాల్మీకిపురం మండలం అయ్యవారిపల్లెకు చెందిన గ్రామస్థులు, రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ పామిలేటిని కలిసి పెద్దబండ దారి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆ మేరకు తహసీల్దార్‌కు వారొక వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు, రైతులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పెద్దబండ ప్రాంతానికి పూర్వం నుంచి దారి ఉందని అయితే ప్రస్తుతం కొందరు రైతులను అటువైపు వెళ్లనివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి తమకు దారి సమస్య తీర్చాలని కోరారు. దీనిపై స్పందించి తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో పరిశీలించి తప్పక దారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వారిలో నాగమల్లేశ్వర్‌రావ్, నరసింహారెడ్డి, గోవిందు, మల్లయ్య, వెంకటరమణ, కె.రెడ్డెప్ప, ఆదినారాయణ, శివశంకర్, శివయ్య పాల్గొన్నారు.

మోతీనగర్‌లో ముమ్మరంగా టీడీపీ సభ్యత్వం


టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న వార్డు ఇన్‌చార్జి ఎస్.నస్రీన్‌తాజ్

మదనపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం మోతీనగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగ సాగుతోంది. 13వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి ఎస్.నస్రీన్‌తాజ్ ఆధ్వర్యంలో మూడురోజులుగా చేపడుతున్నారు. ఇందులోభాగంగా ఎక్కువగా మహిళలు సభ్యత్వాన్ని నమోదు చేయించారు. ఈ మూడురోజుల్లో 160మందికిపైగా సభ్యత్వం తీసుకున్నట్లు నస్రీన్‌తాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేత రాష్ట్రనాయకుడు ఎస్ఏమస్తాన్, బావాజాన్, వేల్పుల వెంకటేష్, సాధిక్, నబీల్, తదిరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి అంకితభావంతో పని చేయాలి


పదవీ విరమణ చేసిన వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఉద్యోగులు

పెద్దమండ్యం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పని చేయాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు పేర్కొన్నారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లు సోమవారం పదవీ విరమణ చేశారు. దీంతో మండల పరిషత్ సహచర ఉద్యోగులు వెంకటేశ్వర్లు దంపతులను దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మనోహర్, డాక్టర్లు ఇమ్మానుయేల్, మహబూబ్‌బాషా, ఏపీవో మురళి, ఈఏలు అక్రం,అశోక్, షావాజ్, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సెలెక్టెడ్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గో బ్యాక్

●దొడ్డి దారిన గెలిచిన వారికి సమావేశానికి వచ్చే అర్హత లేదు
●పదవులకు రాజీనామాలు చేసి ప్రజా క్షేత్రంలో గెలిచిరండి
● టీడీపీ శ్రేణుల నిరసన ● కోరం లేక మండల సమావేశం వాయిదా


ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

తంబళ్లపల్లె, డిసెంబరు 30(ఆం ధ్రజ్యోతి): ప్రజాస్వామ్య బద్ధంగా గెలవని వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులకు మండల సమావేశా నికి వచ్చే అర్హత లేదని.. రాజీనామాలు చేసి ప్రజా క్షేత్రంలో గెలి చి రావాలని టీడీపీ నాయకులు సవాల్ విసిరారు. సోమవారం తంబళ్లపల్లె మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ఉదయం 8 గంటలకే భారీ సంఖ్యలో తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకుని. కార్యాలయం గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. అడ్డదారిలో ఎన్నికైన సెలెక్టెడ్ వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గో బ్యాక్..గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు మాట్లాడుతూ..ప్రజల ఓట్లతో కాకుండా ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి దొడ్డిదారిన ఏకగ్రీవం చేసుకున్న వైసీపీ ప్రజాప్రతినిధులకు మండల సమావేశానికి హాజరయ్యే అర్హత లేదన్నారు. అడ్డదారిలో గెలిచిన వారు తమ పదవులకు రాజీనామాలు చేసి ప్రజాక్షేత్రంలో గెలిచిన తర్వాత సమావేశానికి రావాలని డిమాండ్ చేశారు. కాగా, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, మండల అధికారులు ఉదయం 12 గంటల వరకు సమావేశ మందిరంలో ఎంపీటీసీలు, సర్పంచుల కోసం వేచి చూసినా ఎవ్వరూ హాజరు కాలేదు. దీంతో కోరం లేక సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించడంతో రెండో సారి మండల సమావేశం వాయిదా పడింది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, రాష్ట్ర బీసీ నాయకుడు తులసీధర్ నాయుడు, పార్లమెంటు తెలుగు యవత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, పెద్దేరు ప్రాజెక్టు ఛైర్మెన్ కొటాల శివకుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, రేపన బాబు, ఆదిరెడ్డి, వీరాంజినేయులు, కాలా నారాయణ, మ్యూజికల్ శివ, పురుషోత్తం, మదన, నరసింహులు, జగదీష్, భాస్కర్, నరేంద్రనాయుడు, రఘుపతి, పీర్లమాబు రాధాశెట్టి, బీజేపి నాయకులు భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మయ్య, జనసేన నాయకులు రాజారెడ్డి, సురేష్, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ నోట్‌ఆర్డర్ లేకుండా సమావేశమా..?

మదనపల్లె టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ చట్ట ప్రకారం ఎంపీపీ నోట్ ఆర్డర్ లేకుండా ఎంపీడీవో సర్వసభ్య సమావేశం ఎలా నిర్వహిస్తారని తంబళ్లపల్లె వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్న ఎంపీటీసీలు మాట్లాడుతూ తంబళ్లపల్లె ఎంపీడీవో ఉపేంద్రకుమార్ ఎంపీపీ అనసూయమ్మను సంప్రదించకుండా సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నించారన్నారు. వీటన్నింటిపై విచారించి ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై వైసీపీ ధర్నాలు చేయడం సిగ్గుచేటు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నిమ్మనపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంచారంటూ వైసీపీ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటని మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ మండల నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రజల రక్తం తాగి మరళా ఏవిధంగా ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ పాలనలో గ్రామాలలో ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదని సర్పంచ్‌లను దిష్టి బొమ్మల్లా చేశారని విమర్శించారు. కార్యక్రమంలో నాయ కులు సుధాకర్‌రావు, దేవేంద్రరెడ్డి, శ్రీరాములు, రమణ, మల్లికార్జున, లక్ష్మన్న, రఫి, శంకర, సుధాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ స్థలాన్ని సంరక్షించండి


పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్‌కు వినతులు అందిస్తున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం రెడ్డెప్పనాయుడుకాలనీలో అంబేడ్కర్ భవనానికి కేటాయించిన స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 328లో గతంలో ప్రభుత్వం 8కుంటల స్థలాన్ని అంబేడ్కర్ కమ్యూనిటీ భవనానికి కేటాయించగా అప్పట్లోనే రూ.25 లక్షలతో పునాదులు కూడా నిర్మించారన్నారు. కాని కొందరు ఈ స్థలాన్ని ఆక్రమించేం దుకు యత్నిస్తున్నారన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. భూముల నష్టపరిహారం ఇచ్చాకే ఆర్‌వోబీ నిర్మాణం చేపట్టాలని సీటీఎం గ్రామానికి చెందిన నిర్వాసితులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. 50 ఏళ్లుగా తమ అనుభవంలో వున్న భూమికి పాసు పుస్తకాలు మంజూరు చేయాలని కురబలకోటకు చెందిన కరీమున్నీసా అర్జీ అందజేశా రు. తమ గ్రామానికి తాగునీటి బోరును ప్రైవేటు స్థలంలో వేశారని, ఇప్పుడు ఆ స్థల యజమాని తమకు నీరు సరఫరా చేయకుండా అడ్డుతగులుతున్నారని కోట వారిపల్లె గ్రామస్థులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ నిరసన


తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్యను పరిష్కరించాలని రంగసముద్రం పంచాయతీ సాలేవాండ్లపల్లె గ్రామస్థులు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి మంచినీటి సమస్య పరిష్కారానికి బోరును వేసి మోటారు బిగించి పైపులైన్ వేసినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వక పోవడంతో ఇబ్బందులు తప్పడంలేదన్నారు. ఎన్నిసార్లు అదికారులకు తెలియ చేసినా ప్రయోజనం లేదన్నా రు. ఇప్పటికైనా మంచినీటి సౌకర్యం కోసం విద్యుత్ సర్వీసును ఏర్పాటు చేసి సమస్య లేకుండా చేయాలన్నారు. స్పందించిన ఎంపీడీవో నీటి సమస్య లేకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో వారు నిరసనను విరమించారు.

తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.సమీఉల్లా

కురబలకోట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని వెల్స్ ఫార్గో కంపెనీ వైస్ ప్రసిడెంట్ ఎస్.సమీ ఉల్లా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిర్ధిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని చేరుకోవడానికి నిరంతరం నూతన ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో విబాగాధిపతి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ప్రభుత్వం ఒక్క రోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. 1వ తేదీన నూతన సంవత్సరం కావడంతో ప్రభుత్వం మంగళవారమే మండలంలో మొత్తం 7870 పింఛన్లు ఉండగా రూ.3,41,28000 లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి గ్రామ స్థాయి అధికారులచే అందించనున్నట్లు తెలిపారు.